తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
01-10-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 233
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## సంక్షేమ పథకాలు ఉచితాలు కావు



- 'ఎస్ఐఆర్' పేరు చెప్పి ఓట్లను అక్రమంగా డిలీట్ చేస్తున్నారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరగాలి
- 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్'లో డిప్యూటీ సీఎం భట్టి

2

## శిక్షణతోనే సమర్థ నాయకత్వం



3

- ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ ఆనంద్ దిశానిర్దేశం
- 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో గంటన్నరపాటు ముఖాముఖి
- రోజుకు కనీసం గంట క్రీడలు లేదా వ్యాయామానికి కేటాయించాలి
- 5వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విజేతలకు పతకాలు అందజేత





## ధైర్యం, దైవం కలగలసిన ప్రాంతం

# సిరిసిల్ల

### సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చిన కేసీఆర్ పాలన

### కోట్లాది రూపాయల సొమ్ము చేసుకున్న కేసీఆర్ కుటుంబ సభ్యులు

### పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఉరి సిల్లగా మారింది

### రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

### సిరిసిల్ల సభలో సీఎం రేవంత్ రెడ్డి

**సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్, (సిరి న్యూస్), సెప్టెంబర్ 30 :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవ చింతన, నిజాం రజాకార్లపై చేసిన వీరోచిత పోరాటానికి వారసులుగా సిరిసిల్ల ప్రాంత ప్రజలు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల అంటే సిరులకు నిలయం.. కానీ పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఉరి సిల్లగా మారిందని ఆరోపించారు. మనిషి నాగరికతకు మొదటి అడుగు వస్త్రం. వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా సిరిసిల్ల అని, వేలాది కుటుంబాలు వస్త్ర పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చీరలు, అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేయగల నైపుణ్యం ఇక్కడి చేనేత కార్మికుల సొంతమని పేర్కొన్నారు. సిరిసిల్ల ఉరిసిల్లగా మారితే 2009లో చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు కేకే మహేందర్ రెడ్డి తయారు చేసుకున్న స్థితిలో కేటీఆర్ చేరి 171 ఓట్లతో చావు తప్పి గెలిచారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల ప్రజలు ఓట్లు వేస్తే అక్రమంగా వేల కోట్లు సంపాదించుకుని ప్రపంచంలోనే ధనిక కుటుంబంగా కేసీఆర్ కుటుంబం ఆవిర్భవించిందని విమర్శించారు.

మిగతా 2వ పేజీలో..

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు

2

## పథకాలు ప్రజలకు చేర్చేది ఉద్యోగులే

- మీ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కరీంనగర్‌లో కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం

2



## స్వర్ణం సాధించిన చికిత, జాదవ్‌లకు సీఎం అభినందనలు



- మీ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కరీంనగర్‌లో కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం

2

## మళ్లీ మా ప్రభుత్వం రావడం తథ్యం

- ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే
- బీజేపీతో పొత్తు ఉండదు.. ఒంటరి పోరే
- బీజేపీ-బీఆర్ఎస్‌ల మధ్య ఎలాంటి అవగాహన లేదు
- ఇండియా టుడే కాన్క్లేవ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3





3

## ఉపాధి పనులు వేగవంతం చేయాలి

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రక్షణగా 'ఉపాధి' పథకం
- వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు.. వర్క్ ఫ్రమ్ విలేజ్.. వర్క్ ఫర్ విలేజ్
- తొలిసారిగా 12 వేల మందికి పైగా సర్పంచులతో మంత్రి సీతక్క వీసీ

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు నిరంతరం ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను, సర్పంచులను ఆదేశించారు.

## జైపూర్ కరెంటును రాజస్థాన్‌కు కట్టబెట్టడమా?

- జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని రద్దు చేయండి
- ఆ విద్యుత్తును తెలంగాణ అవసరాలకు వాడాలి
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత హరీశ్ రావు బహిరంగ లేఖ

3





## రోజూ 30 నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలి

- ప్రజలకు క్రీడల శాఖ మంత్రి వాకిటి పిలుపు

2

## జెన్కో అకౌంట్స్ అధికారులకు పదోన్నతులు



- విద్యుత్ సౌధలో ఘనంగా సక్సెస్ మీట్
- ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జెన్కో సీఎండీ హరీష్‌లకు కృతజ్ఞతలు

3

## గ్రీన్ ఎనర్జీకి భారీ ఊతం



3

### రూ.1.86 లక్షల కోట్లతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3'

- 135 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం
- 50 గిగావాట్ అవర్ బ్యాటరీ నిల్వ వ్యవస్థలు
- కేంద్రం నుంచి రూ.54,082 కోట్ల ఆర్థిక సాయం

## అనాలోచిత నిర్ణయాలతో సంక్షోభంలో రైతులు



3

- ఐదు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా
- రైతులకు బీమా రక్షణ లేకుండా చేశారు
- ఎల్ నినోపై కేంద్ర సహాయం కోరాలి
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ నీటి అక్రమ తరలింపు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

# స్వర్ణం సాధించిన చికిత, జాదవ్‌లకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 :**

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో మిక్సడ్ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడమే కాక 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హత సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికిత తానిపర్తితోపాటు సాహిల్ జాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాభి నందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో ఒకేరోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చేసిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. పెద్దపల్లికి చెందిన చికిత ప్రతిభను గుర్తించి ఆమెను వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌లను ముఖ్యమంత్రి అభినందించారు. కాంపౌండ్ ఉమెన్స్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతోపాటు మిక్సడ్ టీమ్ విభాగంలో సాహిల్ జాదవ్‌తో కలిసి దక్షిణ కొరియాపై విజయం సాధించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్న చికిత పేరు తెలంగాణ క్రీడారంగ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. చికిత నిరంతర సాధన, పట్టుదల, దృఢసంకల్పంతో సాధించిన ఈ విజయం క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

**మంత్రి వాకిటి అభినందనలు**

ఆసియా క్రీడల్లో ఆర్చరీ కాంపౌండ్ టీం ఈవెంట్లో స్వర్ణం సాధించిన క్రీడాకారిణి చికితారావుకు క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు తెలియజేశారు. స్వర్ణ పతకాలు సాధించి 2028 లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలంపిక్స్‌కు అర్హత సాధించిన చికితారావు మన తెలంగాణ క్రీడాకారులు అందరికీ గర్వంగా, ఆదర్శంగా నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చికిత తండ్రి శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడి మంత్రి వాకిటి అభినందనలు తెలియజేశారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- **ప్రచారం, వ్యూహాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం**

**హైదరాబాద్, , సెప్టెంబర్ 30 :**

రెండు పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించి ఇతర పార్టీల కంటే ముందంజలో ఉంది. మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ స్థానానికి అభ్యర్థిగా టీపీసీసీ మీడియా విభాగాధిపతి, న్యాయవాది సామ రామ్మోహన్ రెడ్డి ఎంపికయ్యారు. అలాగే నల్గొండఖమ్మంవరంగల్ స్థానానికి మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఎంపికయ్యారు. వీరిద్దరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తమను అభ్యర్థులుగా ప్రకటించి అవకాశం కల్పించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇద్దరు అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైనందున అర్హులైన ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని సీఎం సూచించారు. ప్రచారం, క్షేత్రస్థాయి వ్యూహాలు, ఓటర్లను ప్రసన్నం చేసుకునే అంశాలపై అభ్యర్థులకు తగిన మార్గదర్శకత్వం చేశారు. వీరితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా సీఎంను కలిశారు.

# శిక్షణతోనే సమర్థ నాయకత్వం



**హైదరాబాద్, , సెప్టెంబరు 30:**

పోలీస్ అధికారుల కెరీర్‌కు శిక్షణే పునాది అని తెలంగాణ డీజీపీ సీ.వి. ఆనంద్ అన్నారు. సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో డీజీపీ బుధవారం ముఖాముఖి నిర్వహించారు. సుమారు గంటన్నరపాటు సాగిన ఈ కార్యక్రమంలో పోలీస్ నాయకత్వం, బాధ్యతలు, నైతికత, ప్రజలతో వ్యవహరించే తీరు తదితర అంశాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. పదవిలో ఉన్నంత మాత్రాన నాయకత్వం రాదని, నాయకుడికి ప్రత్యేకమైన లక్షణాలు అవసరమని డీజీపీ పేర్కొన్నారు. ధైర్యం, స్పష్టమైన దార్శనికత, సమగ్రత, విలువలు-నైతికత, బృంద స్ఫూర్తి, నిష్పక్షపాత వైఖరి, సమర్థమైన కమ్యూనికేషన్, కష్టపడి పనిచేసే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతతోపాటు వినయం ముఖ్యమైన నాయకత్వ లక్షణాలని వివరించారు. ముఖ్యంగా నైతిక విలువలపై యువ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో చేసే చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో వారి ప్రతిష్ఠపై ప్రభావం చూపుతాయని చెప్పారు. పోలీస్ సర్వీసులో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్ ఉండే నేపథ్యంలో తమ ప్రతిష్ఠను కాపాడుకోవడం ప్రతి అధికారికి అత్యంత కీలకమని అన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లపై ప్రొబేషనర్లు అవగాహన పెంచుకోవాలని డీజీపీ సూచించారు. ప్రజలతో వ్యవహరించడం, నేరాల దర్యాప్తు, చట్టాల అమలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడం వంటి అంశాల్లో సమగ్ర నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. చట్టాలపై పరిజ్ఞానం మాత్రమే మంచి పోలీస్ అధికారిగా తీర్చిదిద్దదని, నాయకత్వం, మానవీయ దృక్పథం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక అవగాహన, శారీరక దృఢత్వం, ప్రజలతో సమర్థమైన కమ్యూనికేషన్ కూడా అవసరమని పేర్కొన్నారు. "ప్రజలకు భద్రత కల్పించడం, వారికి సకాలంలో న్యాయం అందేలా చూడటమే పోలీసింగ్ అంతిమ లక్ష్యం" అని డీజీపీ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ప్రొబేషనరీ డీఎస్పీల ప్రొఫెషనల్ కోర్సులో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు కలిపి మొత్తం 112 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సుమారు 10 నెలలపాటు జరిగే కోర్సులో ఇండోర్, అవుట్ డోర్ శిక్షణకు సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులపై ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా కాంబాట్ వ్యాయామాలు, గుర్రపు స్వారీ, ఈత, వివిధ రకాల ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 క్లస్టర్-సీలో విజేతలకు డీజీపీ పతకాలు, బహుమతులు అందజేశారు. సెప్టెంబరు 28న ప్రారంభమైన మూడు రోజుల పోటీలు బుధవారం ముగిశాయి. బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని డీజీపీ అన్నారు. ప్రతి పోలీస్ అధికారి రోజుకు కనీసం గంటపాటు క్రీడలు లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. పోలీస్ క్రీడలను గతంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించేవారని, ప్రస్తుతం క్లస్టర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎక్కువమంది పోలీస్ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐజీపీ (పి&ఎల్) గజరావు భూపాల్, డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, ఇతర సీనియర్ అధికారులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు.

# ధైర్యం, దైవం కలగలసిన ప్రాంతం సిరిసిల్ల

**మొదటిపేజీ తరువాయి**



2009 నుంచి 2023 వరకు అరడజనుసార్లు జరిగిన ఎన్నికలలో కేటీఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదో ప్రజలు ఆలోచించాలన్నారు. గల్ఫ్ వెళ్లిన కార్మికులు అక్కడ ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం శవాలను తెచ్చుకునే పరిస్థితి కూడా లేదని, బీఆర్ఎస్ పాలనలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం ఒక క్షణమైనా ఆలోచన చేయలేదని విమర్శించారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ చేయాలని స్థానిక నాయకులు కోరితే ప్రమాదవశాత్తు విదేశాలలో ఇక్కడి కార్మికులు మరణిస్తే శవాన్ని తేవడంతో పాటు సంబంధిత కుటుంబానికి రూ.5 లక్షల సహాయం అందించే పథకాన్ని ప్రజా ప్రభుత్వం తెచ్చిందన్నారు. 2004, 2006, 2008లలో కరీంనగర్ జిల్లా ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించారని, అయినా 2009లో పాలమ□రుకు వలస వచ్చారని, ప్రజలను మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబం రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని రవీందర్ రావు, సంతోష్ రావు, తారక రామారావు మానేరు ఇసుకను దోచుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వీటికి సజీవ సాక్ష్యం నేరెళ్ల బాధితులుగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమారి (జగ్జీవన్ రామ్ బిడ్డ)ను ఇక్కడికి తీసుకొస్తే పోలీసులతో నిర్బంధించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మిడ్ మానేరు డ్యాం ముంపులో కొంప పోయిందని కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇండ్ల స్థలాలు పొందలేదా అంటూ నిలదీశారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కేటీఆర్‌కు పచ్చ నోట్లుగా మారాయన్నారు. వేములవాడ శివయ్య, భద్రాచలం రామయ్యను మోసం చేసినవాడు కేసీఆర్ ఒక్కడు మాత్రమే అని సీఎం విరుచుపడ్డారు.

**నేతన్నల కోసం రూ.1741 కోట్లు ఖర్చు చేశాం**

వెయ్యి రోజుల ప్రజా పాలనలో రూ.1741 కోట్లు నేత కార్మికుల కోసం ఖర్చు చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1700 కోట్లు నిధులు మంజూరు చేశామని, నూలు డిపో వేములవాడలో ఏర్పాటు చేశామని, వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని, ఎమ్మార్వో కార్యాలయం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

**పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలి**

సిరిసిల్లలో మార్పు రాబోతున్నదని, ప్రజల కళ్లలో ఆనందం కనిపిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాబోయే శాసనమండలి ఎన్నికలలో ఒక పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన అభ్యర్థికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మానేరు నది మీద కట్టిన చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి కేసీఆర్ ఇంట్లో నోట్ల కట్టలుగా తేలాయన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 9,10, 11,12 పూర్తి చేయకుండా పెండింగ్ పెట్టడం వల్ల ఇక్కడ రైతులకు గోదావరి నీళ్లు చేరలేదని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే హరీష్ రావు, కేటీఆర్, ఎర్రబెలి దయాకర్ రావు మంత్రులు అయ్యారని, అదే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క మంత్రులు అయ్యారని గ్రహించాలని కోరారు.

**కుటుంబ పాలన కావాలో .. ప్రజా పాలన కావాలో ఆలోచించుకోవాలి**

కుటుంబ పాలన కావాలో ప్రజా పాలన కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. గత పాలకులు ఎవరికైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించారా అంటూ పదేళ్లు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించేందుకు సరిపోలేదా అని ప్రశ్నించారు. గత పాలకులు కనీసం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఆడపిల్లలకు ఇచ్చే బతుకమ్మ చీరలో కమీషన్ కొట్టేశారని సీఎం ఆరోపించారు. బతుకమ్మ చీరలకు రూ.350 కోట్ల బకాయిలు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. గత పాలకులు ఇచ్చిన బతుకమ్మ చీరలు ఆడపిల్లలు ఎప్పుడూ కట్టుకోలేదన్నారు. ఈ పండుగకు చిలక పచ్చ చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని చెప్పారు. రేషన్ కార్డులపై రేషన్ షాపుల ద్వారా నేడు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. రైతు భరోసా కింద రూ.36,000 కోట్లు, రుణ మాఫీ కింద రూ.20,614 కోట్లు రైతులకు చెల్లించామని, 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించామని, నేటి పాలనలో శ్రీకాంతచారి తల్లిని మహిళా కమిషన్ సభ్యురాలిగా, చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యురాలిని మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించామని వివరించారు. సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు సర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్మోహన్ రావు, లక్ష్మీకాంతరావు, డాక్టర్ సంజయ్, శ్రీ గణేష్, నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, డీసీసీ¾ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు కేకే మహేందర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**రూ.340 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

సిరిసిల్లలో మొత్తం రూ.340 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సిరిసిల్లలో నేతన్న బజార్‌కు, సిరిసిల్లతోపాటు వేములవాడలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. సిరిసిల్ల, వేములవాడలో రెండు ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్ ప్రారంభించారు. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ, సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు.

# పథకాలు ప్రజలకు చేర్చేది ఉద్యోగులే

**మొదటిపేజీ తరువాయి**

**కరీంనగర్, , సెప్టెంబర్ 30 :**

పేదలకు సంక్షేమ పథకాలు చేరవేసే ప్రతినిధులు ప్రభుత్వోద్యోగులే అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో బుధవారం పర్యటించిన ముఖ్యమంత్రి కరీంనగర్ కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగులే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతినిధులని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేది అధికారులే అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగుల సమస్యలను మీ సహకారంతో ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని, మనం ప్రజలకు సేవలు అందిస్తూనే సమస్యలను పరిష్కరించుకుందామని సీఎం చెప్పారు. అప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం బలపడుతుందన్నారు. మీరంతా కష్టపడితేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రికైనా, ప్రధానమంత్రికైనా మంచి పేరు రావాలంటే ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమని అన్నారు. ప్రజలకు సేవలు అందించే మీకు మౌలిక వసతులు కల్పించాలనే ఈ భవన సముదాయ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.944 కోట్లతో పనులను ప్రారంభించుకున్నామని తెలిపారు. అందరి సహకారంతోనే ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. పేదల సమస్యల చిక్కుముడులు విప్పడానికి ఈ కార్యాలయం ఉపయోగపడాలన్నారు. సహాయం కోసం నిస్సహాయంగా వచ్చే వారిలో మన కుటుంబ సభ్యులను చూడండి.. అప్పుడే సహాయం వారికి నూటికి నూరు శాతం న్యాయం జరుగుతుందని, సమస్యలతో వచ్చిన పేదలకు వెంటనే పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వందల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టులు నిర్మించినా కేంద్రం అనుమతులు ఇవ్వకపోతే ప్రయోజనం ఉండదన్నారు. కొందరు తమ దిల్లీ పర్యటనలను లెక్కలేస్తున్నారు.. సమస్యలు పరిష్కరించుకునేందుకు ఎన్నిసార్లైనా కేంద్రాన్ని కలవాల్సిందేనని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు నెలల్లోనే 170 ఎకరాలు డిఫెన్స్ భూములను రాష్ట్ర అభివృద్ధి కోసం బదలాయించేలా చేశామని, బేగంపేట రన్ వే కింద నుంచి రోడ్డు వేసుకునేందుకు అనుమతులు సాధించామని, సిద్ధాంతాలు వేరైనా అభివృద్ధి కోసం ఒకరికొకరం సహకరించుకుంటాం అని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను ముందు కార్యక్రమాలను ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలన్నారు. ఎన్నికలు లేని సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో రూ.944 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించామని, మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.840 కోట్ల నిధులు సాధించామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తే ముఖ్యమంత్రిగా అభినందించడంలో ఎలాంటి శషభిషలు లేవన్నారు. మరోసారి ఇక్కడికి వచ్చి జిల్లా అభివృద్ధిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అక్కడినుంచే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు వేగవంతం చేయాలి

**హైదరాబాద్, , సెప్టెంబర్ 30 :**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు నిరంతరం ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను, సర్పంచులను ఆదేశించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 12 వేల మందికి పైగా సర్పంచులు, సీఈవోలు, డీఆర్డీవోలు, మండల, జిల్లా అధికారులతో సచివాలయం నుంచి ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ కూలీల ఆదాయం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పశుగ్రాసంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఉపాధి హామీ పనులను కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమంగానే కాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రక్షణ కల్పించేలా, నీటి వనరులను పెంపొందించేలా అమలు చేయాలని సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు.. వర్క్ ఫ్రమ్ విలేజ్.. వర్క్ ఫర్ విలేజ్ అనే స్ఫూర్తితో సర్పంచులు గ్రామాల్లోనే అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. మన ఊరుమనమే బాగు చేసుకోవాలన్న స్ఫూర్తితో సర్పంచ్ గ్రామ అభివృద్ధికి కథానాయకుడిగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

**రోజుకు కనీసం 6 లక్షల మందికి ఉపాధి**

ప్రతి గ్రామ పంచాయతీలో రోజూ కనీసం 100 నుంచి 150 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కూలీలకు నిరంతరం పని లభించేలా ముందుగానే పనులను గుర్తించి, అంచనాలు సిద్ధం చేయాలి. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, రోజుకు రూ. 308 వేతనం అందేలా ఉత్పాదక పనులను ప్రణాళిక చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ కనీసం 6 లక్షల మందికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, గ్రామంలో 18 ఏళ్లు నిండిన అర్హులైన కుటుంబ సభ్యులకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట" అనే లక్ష్యంతో నీటి సంరక్షణ పనులు చేపట్టాలన్నారు.

**గ్రామ సభల నిర్ణయాలకే ప్రాధాన్యత**

అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యంతో పనులకు ఆమోదం తీసుకోవాలన్నారు. 2026 అక్టోబర్ నుంచి 2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులను ముందుగానే సిద్ధం చేయాలి. ప్రతి పంచాయతీకి సుమారు రూ. 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉపాధి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని గ్రామాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పక్షపాతంతో కొన్ని జిల్లాలకే నిధులు కేటాయించారని, తమ ప్రభుత్వం జనాభా, స్థానిక అవసరాల ప్రాతిపదికన అన్ని జిల్లాలకు సమన్యాయం చేస్తుందని స్పష్టం చేశారు.

**నవంబర్ 19లోపు వీవో భవనాల పూర్తి**

రాష్ట్రంలో ప్రస్తుతం రూ. 204.50 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. వాటితో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, వీవో (V.O) భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీవో భవనాలను నవంబర్ 19 లోపు పూర్తి చేయాలని, ప్రతి మహిళా సంఘం భవనం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద కమ్యూనిటీ శానిటరీ యూనిట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

# రోజూ 30 నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలి

- **'ఖేలో తెలంగాణ' కార్యక్రమం ప్రారంభం**

**హైదరాబాద్, ప్రజాతంత్ర, సెప్టెంబర్ 30:**

పౌరుల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడల శాఖ, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్‌జీ) ఆధ్వర్యంలో ఖేలో తెలంగాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. పౌరులు తమ దైనందిన జీవితంలో శారీరక వ్యాయామాన్ని అంతర్భాగంగా చేసుకోవడాన్ని ప్రోత్సహించడం ద్వారా తెలంగాణను ఆరోగ్యవంతమైన, చురుకైన, ఉత్సాహభరితమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం లక్ష్యం. నడక, పరుగు, యోగా, క్రీడలు, ఇతర ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో ప్రజలు క్రమం తప్పకుండా పాల్గొనాలని ఈ ప్రచారం ప్రోత్సహిస్తోంది. ప్రజలందరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించాలని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన 'ఖేలో తెలంగాణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్యమే అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన తెలంగాణకు పునాది అని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌ను జీవితాంతం అలవాటుగా చేసుకోవాలని పౌరులను కోరారు. విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వృద్ధులు, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలు, సమాజాన్ని ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించేలా ప్రేరేపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**సీఎంకు ఖేలో తెలంగాణ బంధన్ ఛాలెంజ్**

ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మాజీ భారత క్రికెట్ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, శాట్‌జీ చైర్మన్ కె.శివసేన రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనిబాలా దేవి, డీజీపీ సి.వి. ఆనంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్, పారా అథ్లెట్ దీప్తి జీవాంజి, షూటర్ ఈషా సింగ్ తదితర ప్రముఖులకు మంత్రి ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.

# సంక్షేమ పథకాలు ఉచితాలు కావు

**కొచ్చి, సెప్టెంబర్ 30 :**

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల ఉజ్జ్వల భవిష్యత్తుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను 'ఫ్రీబీస్' (ఉచితాలు)గా చూడకూడదని, అవి నాణ్యమైన మానవ వనరుల తయారీకి ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడులని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొచ్చిలో బుధవారం నిర్వహించిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్నికల వ్యవస్థ, ఎస్ఐఆర్, సంక్షేమ పథకాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, పెట్టుబడులు, కాంగ్రెస్ పార్టీతో తన అనుబంధం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు ఉన్నటువంటి సంబంధాల గురించి వివరంగా మాట్లాడారు. పేదలకు ఇళ్లు, ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందించడం ద్వారానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి తెలిపారు. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రాష్ట్ర జీఎస్‌డీపీపై ప్రభావం చూపేలా ఉండాలన్నదే తమ విధానమని అన్నారు. వైద్యం & విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తున్నామని వివరించారు. సంక్షేమం కింద మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో 53 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు.



**'ఎస్ఐఆర్' పేరు చెప్పి ఓట్లను అక్రమంగా డిలీట్ చేస్తున్నారు**

సోషల్ మీడియా వేదికల ద్వారా ఏ ఓటర్లు ఏ పార్టీకి మద్దతుగా ఉన్నారో ముందస్తుగా విశ్లేషించి కేంద్రీకృత పద్ధతిలో ఫారమ్7 దరఖాస్తుల ద్వారా ప్రతిపక్ష మద్దతుదారుల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారని భట్టి ఆరోపించారు. 'ఎస్ఐఆర్' పేరు చెప్పి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు 40వేలనుండి 50వేల వరకు ఓట్లను అక్రమంగా డిలీట్ చేస్తున్నారన్నారు. తన సొంత నియోజకవర్గంతోపాటు పొన్నం ప్రభాకర్ వంటి సీనియర్ నాయకులు, పలువురు పోటీదారుల పేర్లను కూడా ఓటర్ల జాబితాలో అనుమానాస్పదంగా ఉంచారని మండిపడ్డారు. సాధారణంగా రెండు వేల నుండి పది వేల స్వల్ప ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే నియోజకవర్గాల్లో ఈ తరహా కుట్రలు ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.

**గెలుపోటముల కంటే వ్యవస్థలపై విశ్వాసమే ముఖ్యం**

'కాంగ్రెస్ గెలిచిన ప్రాంతాల్లో ఎన్నికల సంఘాన్ని ఎందుకు ప్రశ్నించరు' అన్న ప్రశ్నకు స్పందిస్తూ తమకు విపరీతమైన ప్రజాదరణ ఉన్న చోట 30వేలనుండి 40వేల ఓట్లు తొలగించినప్పటికీ మెజారిటీ తగ్గి గెలుపొందుతున్నామని భట్టి వివరించారు. రాజకీయ పార్టీలు ఓడిపోవచ్చు లేదా గెలవవచ్చు కానీ, పౌరులకు రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై విశ్వాసం సడలకుండా చూడటమే ప్రధానమని స్పష్టం చేశారు. 100 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో తాము వేసే ఓటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు ఆ సందేహాలను నివృత్తి చేసి పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉందన్నారు. కేంద్రం క్షమాపణ చెప్పి దిగిపోవాలి. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నందుకు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఉప ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన అత్యంత ఆవశ్యకమని ఆయన ఉద్ఘాటించారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చూసి, ఓటర్లలో నమ్మకాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా బీజేపీకి లబ్ధి చేకూర్చేలా పలువురు నేతల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ కూడా దిగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలి**

దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి గణనీయంగా ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ తిరిగి వచ్చే వనరుల విషయంలో సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని భట్టి అన్నారు. జీఎస్టీ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. జీఎస్టీ పన్నుల రూపంలో రాష్ట్రం నుంచి రూపాయి పన్ను పంపిస్తే కేంద్ర ఇస్తున్నది 43 పైసలు మాత్రమేనని, అదే బిజెపి పాలిత రాష్ట్రమైన బీహార్ కు రెండు రూపాయల వరకు ఇస్తున్నారని ఉదాహరణగా వివరించారు. దేశాన్ని 'రాష్ట్రాల సమాఖ్య'గా గుర్తించి దేశ ఆర్థికాభివృద్ధికి రాష్ట్రాలు అందిస్తున్న సహకారాన్ని పరిగణనలోకి తీసుకుని వనరుల పంపిణీ జరగాలని కోరారు. 'డబుల్ ఇంజిన' ప్రభుత్వాలకు కేంద్రం నుంచి ఎక్కువ ప్రయోజనాలు లభిస్తున్నాయా అన్న ప్రశ్నకు అవునని సమాధానమిచ్చారు.

**శరవేగంగా హైదరాబాద్ అభివృద్ధి**

హైదరాబాద్‌లో లభ్యమయ్యే భారీ టాలెంట్ పూల్, ప్రపంచస్థాయి మౌలిక వసతులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఫైనాన్షియల్ సిటీ, హైటెక్ సిటీలు తెలంగాణకు ప్రధాన బలాలని భట్టి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి, రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకోబోయే పాలనాపరమైన నిర్ణయాలు, పెట్టుబడులకు తెలంగాణ ఏ విధంగా అనుకూలమైన ప్రాంతం అనే విషయాలను ఈ సదస్సు వేదికగా ఆయన వివరించారు

**పాత నాయకులకు పిలుపు.. రేవంత్‌తో సఖ్యతగా పనిచేస్తున్నా**

దేశంలో అన్ని వర్గాలను, మతాలను సమైక్యంగా ఉంచి అభివృద్ధి పథంలో నడిపించే విజన్ ఒక్క కాంగ్రెస్‌కే ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. యువ ఎమ్మెల్యేల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వైఎస్ఆర్ ఐదు రోజుల పాటు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారని తెలిపారు. ఆ సమయంలోనే తాను ఆయనకు, కాంగ్రెస్ సిద్ధాంతాలకు మరింత దగ్గరయ్యానని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి, దళిత నాయకత్వంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ కాంగ్రెస్‌లో పనిచేసే నాయకులను కులం ప్రాతిపదికన తాను చూడనని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి ఇతర పార్టీలు పెట్టుకున్న లేదా ఇతర పార్టీలలో చేరిన పాత కాంగ్రెస్ నాయకులందరూ తిరిగి సొంత గూటికి (కాంగ్రెస్‌కు) రావాలని పిలుపునిచ్చారు. పాత కాంగ్రెస్ నాయకులంతా తిరిగి వస్తే దేశాన్ని బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడానికి సహాయపడుతుందన్నారు. అలా వారు తిరిగి వస్తే అత్యంత సంతోషించే వ్యక్తిని తానే అని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను 100 శాతం సఖ్యతతో పనిచేస్తున్నానని, ప్రభుత్వ నిర్ణయాలన్నీ సమష్టి చర్చల ద్వారానే తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సిద్ధాంతాలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సహచర మంత్రులందరం కలిసి పనిచేస్తున్నాం అని భట్టి తెలిపారు

# జైపూర్ కరెంటును రాజస్థాన్‌కు కట్టబెట్టడమా?

**హైదరాబాద్, , సెప్టెంబర్ 30 :**

మంచిర్యాల (జైపూర్) సింగరేణి విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్తును రాజస్థాన్‌కు తరలించే జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకుని ఆ విద్యుత్‌ను వంద శాతం తెలంగాణ అవసరాలకే వినియోగించాలని బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు కరెంటు లేక పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు మీరు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ప్రశ్నించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉందని, నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కన ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయని తెలిపారు. బొగ్గు, నీళ్లు, స్థలం మనవి.. అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి అని నిలదీశారు. మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా అని అన్నారు. సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్ఆర్‌వీయూఎన్ఎల్ విద్యుత్ సంస్థతో ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారని, అంతేకాక రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల భారీ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడతారని, ఇది దాదాపు రూ.22,000 కోట్ల భారీ ప్రాజెక్టు అని తెలిపారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి.. అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలి అని ప్రశ్నించారు. మన రాష్ట్రమే కరెంటు లేక అల్లాడుతున్న వేళ ఈ తొందరపాటు నిర్ణయం ఎందుకు అని అడిగారు. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ లోటును అధిగమించేందుకు కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మిస్తే అందులో ఉత్పత్తయ్యే విద్యుత్తును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సరిగ్గా అందించలేకపోతోందని ఎద్దేవా చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 78 గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారన్నారు. ఈ పవర్ హాలిడేలతో రైతులు కన్నీరు పెడుతుంటే పాలనా వైఫల్యాన్ని ఎల్‌నినో మీదకు నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదన్నారు. మీ నిర్వహణ లోపం వల్లే నేడు రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలు కునారిల్లుతున్నాయని వ్యాఖ్యానించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం నిర్మించిన 4000 మెగావాట్ల యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ ప్లాంటులో నేడు విద్యుత్ ఉత్పత్తి సగానికి పడిపోయిందని, దానికి జీ10, జీ11 నాణ్యత గల బొగ్గు వాడాల్సి ఉండగా నాసిరకమైన జీ13, జీ14 బొగ్గును వాడి బాయిలర్లు దెబ్బతినేలా చేస్తున్నారని ఆ లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు కొరతతో కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయిందని, నిబంధనల ప్రకారం థర్మల్ కేంద్రాల్లో 45 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాల్సి ఉండగా కనీస ఉత్పత్తి ఉంచకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెబుతున్న మీరు విద్యుత్ కేంద్రాల వద్ద ఎందుకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అడిగారు. ఈ వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ వెళ్తే పోలీసులను పెట్టి అడ్డుకోవడం మీ నియంతృత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో ఎన్‌టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్ ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, 1600 మెగావాట్లు రాష్ట్రానికి ఇస్తామంటే మీ ప్రభుత్వం తిరస్కరించిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి ఎలాంటి అదనపు భారం లేకుండా వచ్చే ఈ విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు అని ఎందుకు చెప్పిందన్నారు. రాజస్థాన్‌తో చేసుకున్న విద్యుత్ జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి. జైపూర్‌లో ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను వంద శాతం తెలంగాణే వినియోగించుకునేలా రాష్ట్ర డిస్కంలతోనే అగ్రిమెంట్ చేసుకోవాలి. యాదాద్రి, భద్రాద్రి, కొత్తగూడెం కేంద్రాల్లో బొగ్గు కొరత లేకుండా పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర విభజన హామీ ప్రకారం ఎన్టీపీసీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్ కోసం తక్షణమే పీపీఏ ఒప్పందం చేసుకొని రాష్ట్రంలోని రైతులు, ప్రజల కరెంటు కష్టాలను తీర్చాలి. ఈ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రాజస్థాన్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని,. లేనిపక్షంలో రైతులు, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని హరీష్‌రావు హెచ్చరించారు.

# మళ్లీ మా ప్రభుత్వం రావడం తథ్యం

**హైదరాబాద్/కొచ్చి, సెప్టెంబర్ 30 :**

తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కల్వకుంట్ల చంద్రశేఖరరావు(కేసీఆర్) మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ధీమా వ్యక్తం చేశారు. కేరళలోని కొచ్చిలో బుధవారం జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం - ఆవిర్భావం నుండి రూపాంతరం అనే అంశంపై కేటీఆర్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. మీరు ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థి.. అని యాంకర్ అంటే కేటీఆర్ బదులిస్తూ 'ఖచ్చితంగా కాదు.. రాబోయే ఎన్నికల్లోనూ కేసీఆరే మా ముఖ్యమంత్రి అభ్యర్థి.. రెండేళ్ల తర్వాత మళ్లీ ఆయనే సీఎం పీఠాన్ని అధిరోహిస్తారు.. తదుపరి సదస్సులో కేసీఆరే ముఖ్యమంత్రి హోదాలో ఇక్కడ కూర్చుని మీతో మాట్లాడతారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ ఊహాగానాలకు ఆయన తెరదించారు. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోబోతోందంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆరఎస్‌బీజేపీల మధ్య అంతర్గత అవగాహన ఉందంటూ అధికార పదేపదే ఆరోపిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీఆరఎస్ ఖాతా తెరవలేకపోవడం, పలువురు నేతలు పార్టీని వీడటంతో గులాబీ శ్రేణుల్లో కొంత స్తబ్దత నెలకొంది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు, విపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు కేటీఆర్ జాతీయ వేదికలపై పార్టీ వైఖరిని స్పష్టంగా ప్రకటించారు.

**కాంగ్రెస్ వాగ్దానాలకు ప్రజలు మోసపోయారు**

మూడేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ ఎన్నో తప్పుడు వాగ్దానాలు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏటీఎంలా ఉండే కార్డులు ఇచ్చింది. తెలంగాణ ప్రజలకు వాళ్లు 420 హామీలు ఇచ్చారు. బంగారం, స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500 సహా 420 హామీలు ఇచ్చారు. మేం కేవలం 1.8 శాతంతో అధికారం కోల్పోయాం. 4 లక్షల ఓట్ల అతి తక్కువ తేడాతో కోల్పోయాం అని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు గత ప్రభుత్వాన్ని, ప్రత్యేకించి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించినందుకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే తెలంగాణ వీధుల్లో తిరుగుబాటు వస్తది అని అన్నారు.

**బీజేపీతో పొత్తుల ప్రసక్తే లేదు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ఎస్‌బీజేపీల మధ్య అంతర్గత అవగాహన ఉందంటూ అధికార కాంగ్రెస్ పదేపదే ఆరోపిస్తోందని కేటీఆర్ తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీఆరఎస్ ఖాతా తెరవలేకపోవడం, పలువురు నేతలు పార్టీని వీడటంతో గులాబీ శ్రేణుల్లో కొంత స్తబ్దత నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు, విపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు కేటీఆర్ జాతీయ వేదికలపై పార్టీ వైఖరిని ఇంత స్పష్టంగా ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, తదుపరి సార్వత్రిక ఎన్నికల లక్ష్యంగా బీఆర్ఎస్ ఒంటరి పోరాటానికి సిద్ధమవుతోందని కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల సిద్ధాంతాలు వేర్వేరు ధ్రువాలని, రాజకీయంగా తాము ఆ పార్టీతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. 'మా పార్టీకి 26 ఏళ్ల చరిత్ర ఉంది.. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మేము ఎన్నడూ బీజేపీతో పొత్తు పెట్టుకోలేదు.. 2014, 2018, అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగింది. సిద్ధాంతాలు, పార్టీ డీఎన్ఏ మారనంత వరకు భవిష్యత్తులోనూ ఒంటరి పోరాటమే ఉంటుంది' అని తేల్చి చెప్పారు. 2023 ఎన్నికల తర్వాత అధికారానికి దూరమైనప్పటికీ పార్టీ కేడర్ బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపే తిరిగి నిలుస్తారని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# అనాలోచిత నిర్ణయాలతో సంక్షోభంలో రైతులు

**నల్గొండ సెప్టెంబర్ 30:**

కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ముందస్తు ప్రణాళిక లేమి, నిర్లక్ష్య వైఖరి కారణంగానే నేడు వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎండిన పంట పొలాలను, బోర్లపై ఆధారపడి సాగుచేస్తున్న రైతుల దుస్థితిని స్వయంగా పరిశీలించిన అనంతరం నాగార్జునసాగర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 నుంచి 15 గంటల విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుతున్నది గరిష్టంగా ఐదు గంటలు మాత్రమేనని రైతులు వాపోతున్నారని తెలిపారు. అది కూడా తీవ్రమైన ట్రిప్పింగ్‌లు, బ్రేక్‌డౌన్లతో సరఫరా అవుతుండటంతో భూగర్భ జలాలు తోడలేక కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ లేక ఒకవైపు పొలాలు ఎండుతుంటే మరోవైపు గ్రామాల్లో ప్రజలు, చిన్నారులు ఫ్యాన్లు తిరగక తీవ్ర ఉక్కపోత, దోమలతో నరక యాతన అనుభవిస్తున్నారని ఫైరయ్యారు. వరంగల్ 'రైతు డిక్లరేషన్' సభలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కంటే మెరుగైన బీమా పథకాన్ని తెస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక రైతులకు కనీస బీమా రక్షణ లేకుండా మోసం చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నుంచి ప్రీమియం చెల్లించకుండా ఫసల్ బీమాను పక్కనబెట్టగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతోందన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం, ప్రకృతి వైపరీత్యంపై ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని, కర్ణాటక ప్రభుత్వం తరహాలోనే కేంద్ర ప్రభుత్వ సహాయం కోరి కేంద్ర బృందాన్ని రప్పించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయించాలని, రైతులకు తక్షణ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరవాసుల తాగునీటి అవసరాలు నాగార్జునసాగర్ నుంచి ఫేజ్1, ఫేజ్2, ఫేజ్3 ద్వారా తీరుతున్నాయని, నగరంలోనూ, పట్టణాల్లోనూ తీవ్ర తాగునీటి ఎద్దడి రాకుండా ఉండాలంటే ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని వెంటనే కిందికి విడుదల చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల కేటాయింపుల్లో 811 టీఎంసీలలో తెలంగాణ ప్రవాహ ప్రాంతం ఎక్కువగా ఉండి కనీసం 500 టీఎంసీలు రావాల్సి ఉండగా గత కేసీఆర్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలకే సంతకం పెట్టి తీరని ద్రోహం చేసిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం ఫ్లడ్ వాటర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నికర జలాలను తరలించుకుపోతున్న వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని, తెలంగాణ నికర జలాల పరిరక్షణ కోసం బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఇటీవల క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు, రైతుల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు తాను స్వయంగా జూరాల ప్రాజెక్టు వద్దకు వెళితే పోలీసులు అడ్డుకున్నారని రామచందర్ రావు మండిపడ్డారు. రైతులకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో అధికారులు అదే రోజు సాయంత్రం కొంత నీటిని విడుదల చేయడంతో ఆ పరివాహక ప్రాంత రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. కేవలం రూ.900 కోట్లతో నెట్టెంపాడు, డిండి, కల్వకుర్తి తదితర చిన్న ప్రాజెక్టుల మరమ్మతులు, డీసిల్టింగ్ పనులు పూర్తి చేసి ఉంటే కృష్ణా పరివాహక ప్రాంతంలో ఇంతటి నీటి కొరత ఉండేది కాదన్నారు.

# జెన్కో అకౌంట్స్ అధికారులకు పదోన్నతులు

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్):**

జెన్‌కో అకౌంట్స్ విభాగంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు మేనేజ్‌మెంట్ ద్వారా పదోన్నతులు కల్పించిన సందర్భంగా అకౌంట్స్ అధికారులు బుధవారం ఘనంగా సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్‌లోని విద్యుత్ ప్రభా భవన్‌లో ఉన్న అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ వేడుకకు వివిధ విభాగాల నుంచి అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అకౌంట్స్ విభాగంలోని అన్ని స్థాయిల ఉద్యోగులకు ప్రమోషన్లు అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న ఉన్నతాధికారులకు, అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పి. అంజయ్య మాట్లాడుతూ.. అకౌంట్స్ అధికారుల చిరకాల కోరికైన పదోన్నతుల ప్రక్రియను సాకారం చేసిన ఎనర్జీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జెన్‌కో సీఎండీ హరీష్, హెచ్‌ఆర్ డైరెక్టర్ కుమార్ రాజా, ఫైనాన్స్ డైరెక్టర్ వీరా మహేందర్, సీఏఎఫ్‌వో సత్యరాజ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా ఈ ప్రమోషన్ల సాధనలో అండగా నిలిచిన అసోసియేషన్ నాయకులు, సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్‌లోనూ అకౌంట్స్ అధికారులు మరింత అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ పురోగతికి కృషి చేయాలని, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నాసర్ షరీఫ్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పరమేశ్, స్టేట్ ఫైనాన్స్ సెక్రటరీ అనిల్, స్టేట్ ఉమెన్ సెక్రటరీ అనురాధ, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు వేణు, మధు, కంపెనీ ప్రెసిడెంట్ అశోక్, సిద్ధు తదితర ప్రముఖులు, అకౌంట్స్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# గ్రీన్ ఎనర్జీకి భారీ ఊతం

- **2032-33 నాటికి ప్రాజెక్టు పూర్తి లక్ష్యం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:**

దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్3' ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే సుమారు 135 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

**రూ.1.86 లక్షల కోట్ల వ్యయం**

ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.1,86,405 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించడంతో పాటు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు 50 గిగావాట్ అవర్ (GWh) సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.54,082 కోట్ల ఆర్థిక సాయం అందించనుంది. 203233 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**బొగ్గు ఆధారిత విద్యుత్‌కు ప్రత్యామ్నాయం**

గ్రీన్ ఎనర్జీ కారిడార్ విస్తరణతో పునరుత్పాదక విద్యుత్‌ను సమర్థంగా ప్రసారం చేసే సామర్థ్యం పెరగనుంది. ప్రసార వ్యయాలను తగ్గించడంతో పాటు సౌర, పవన విద్యుత్ వినియోగానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. తద్వారా బొగ్గు ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించి, దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని విస్తరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

# ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు!



- **మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సాయినాథ్!!**

**శివంపేట సెప్టెంబర్ 30 (సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని పాంబండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో హార్ట్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో క్లియర్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ సాయినాథ్ సహకారంతో 500 లీటర్ల ఆర్వో వాటర్ ప్లాంట్ ప్యూరిఫికేషన్ ప్లాంటును 1,90,000 వేల రూపాయలతో ఏర్పాటు చేశారు. దీనితో పాటు 140 మంది విద్యార్థిని విద్యార్థులకు ఒక లీటర్ స్టీల్ వాటర్ బాటిల్స్ 20 వేల రూపాయలతో ఇప్పించారు. కంపెనీ ప్రతినిధులైన చైతన్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి ముందుకు వచ్చిన ట్రస్ట్ సభ్యులను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ నాయిని సమతా వేణుగోపాల్ రెడ్డి,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హరీశ్ రావును కలిసిన మహేంద్ర అండ్ మహేంద్ర మాజీ చైర్మన్

**మెదక్ : సెప్టెంబర్ 30 (సిరి న్యూస్ )**

మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీ మాజీ చైర్మన్ మిన్నేని మదన్ మోహన్ రావు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావును హైదరాబాదులోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. పరస్పర యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



# రవీంద్ర భారతి ముట్టడిలో మెదక్ జిల్లా ఉద్యమ కళాకారులు




**కొల్చారం, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ముట్టడి కార్యక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు. ఉద్యమ నిరుద్యోగ కళాకారులు భారీ ర్యాలీగా రవీంద్ర భారతి ముట్టడికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు కళాకారులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముట్టడి కార్యక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన ఉద్యమ కళాకారులు వరిగుంతం కమ్మరి శేఖర్ చారి, బద్దం సుమలత, శ్రీశైలం గౌడ్, భూమయ్య, గుడాల చంద్రశేఖర్, అలారం పాపయ్య, నేనావత్ నరేందర్ పాల్గొన్నారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో సైబర్ మోసాలు – అప్రమత్తంగా ఉండాలి

- **గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారానే వెళ్లాలి: POE దేవులపల్లి ఆనంద్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (సమయం-న్యూస్):**

విదేశీ ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియా, వాట్సాప్, యూట్యూబ్, ఈమెయిల్ ద్వారా జరుగుతున్న మోసాలపై వలస కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ (POE) హైదరాబాద్ అధికారి దేవులపల్లి ఆనంద్ సూచించారు. బుధవారం POE కార్యాలయంలో తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్ల, బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ నరేంద్ర పన్నేరు, సిరిసిల్ల జిల్లా గల్ఫ్ కాంగ్రెస్ కన్వీనర్ తోట ధర్మేందర్ ఆయనను కలిసి వలస కార్మికుల సమస్యలు, ఉద్యోగ మోసాలపై చర్చించారు. ఆనంద్ మాట్లాడుతూ నకిలీ ఏజెన్సీలు, సబ్‌ఏజెంట్లను నమ్మవద్దని, గుర్తింపు పొందిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారానే విదేశాలకు వెళ్లాలని సూచించారు. ఉద్యోగదాత, వీసా, ఒప్పందం, జీతభత్యాల వివరాలను ముందుగానే పరిశీలించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే చెల్లించాలని తెలిపారు. అధిక జీతాల పేరుతో నకిలీ ఆఫర్ లెటర్లు, వీసాలతో మోసాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం

- **పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్):**

పోషక ఆహారంతో పాటు గర్భిణీ బాలింతలకు అందించే ఆరోగ్యలక్ష్మి, ఒక పూట భోజనం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నాగిరెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ గడ్డం లావణ్య గోవర్ధన్ రెడ్డి తల్లులకు సూచించారు. గుమ్మడిదల మండల పరిధిలోని నాగిరెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలను మంగళవారం అంగన్వాడీ టీచర్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించడంతో పాటు

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలకు వివరించి, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం విఠల్ రెడ్డి, గ్రామ పెద్దలు గడ్డం జంగారెడ్డి వార్డు సభ్యులు లక్ష్మి, జ్యోతి, మల్లేష్, రాజు, మంజుల, అంగన్వాడి టీచర్ అనిత సహాయకులు స్వప్న, మహిళలు తదితరులు పాల్గొన్నారు



# పీఏసీఎస్‌లో అర్ధవార్షిక మహాజన సభ..

**వెల్దుర్తి, సెప్టెంబర్ 30,( సిరి న్యూస్):**

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అర్ధవార్షిక మహాజన సభ బుధవారం నిర్వహించారు. చైర్మన్ అనంత రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ఆర్థిక కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, రుణాల వసూళ్లపై చర్చించారు. సీఈఓ దస్తారి అశోక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 వరకు డీసీసీబీ ద్వారా 1,799 మంది సభ్యులకు రూ.15.04 కోట్ల స్వల్పకాలిక రుణాలు, 66 మంది సభ్యులకు రూ.2.60 కోట్ల దీర్ఘకాలిక రుణాలు అందించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 672 టన్నుల యూరియా, 217 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 53 బ్యాగుల పొటాష్‌ను విక్రయించినట్లు వివరించారు. 2025-26 యాసంగి సీజన్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 18 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 4,408 మంది రైతుల నుంచి 1,85,867.60 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చైర్మన్ అనంత రెడ్డి వెల్లడించారు. రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ పీఏసీఎస్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఏసిఎస్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వివాదాలు వదు.. సంఘం అభివృద్ధి చేసుకుందాం

- **చేనేత సంఘానికి పూర్వవైభవం తీసుకొద్దాం**
- **చేనేత సహకార సంఘం అధ్యక్షులు సత్యం**
- **జోగిపేట చేనేత సంఘం మహాసభ**

**జోగిపేట, సెప్టెంబర్ 30, (సిరి న్యూస్):**

సమన్వయంతో సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, వివాదాలకు వెళ్లి సంఘ ప్రతిష్టను దెబ్బతీయకూడదని జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ పడిగె సత్యం సూచించారు. బుధవారం సంఘం ఆవరణలో 79వ వార్షిక 83వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఏర్పడి మూడు నెలలు అయ్యిందని, సంఘానికి పూర్వవైభవం తీసుకురావడానికి పాలకవర్గం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో చేనేత సంఘాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. సంఘం లావాదేవీల్లో పొరపాట్లు జరగకుండా చూస్తానని సభ్యులకు తెలియజేసారు.

**వారం రోజుల్లో రూ.కోటి క్యాష్ క్రెడిట్ వివరాలు ఇవ్వాలి**

2013 సంవత్సరం నుంచి క్యాష్ క్రెడిట్ ప్రస్తుతం సుమారుగా కోటి రూపాయల వరకు అప్పు ఉందని, దీనికి సంబంధించిన పూర్తి సమాచారం పాలకవర్గానికి
7 రోజుల్లో గా సమర్పించాలని సొసైటీ వైస్ చైర్మన్ పి.అనంతరాజ్ డిమాండ్ చేశారు. మహాసభలో ఇదివరకు జరిగిన కార్యకలాపాలపై వాగ్వివాదం జరిగింది. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా యారన్ తీసుకురావాలని చైర్మన్‌ను కోరారు. ఎన్ హెచ్ డి సి ద్వారా యారన్ కొనుగోలు చేస్తేనే కార్మికులకు జీవిత బీమా, పావలా వడ్డీ, ఇతర సదుపాయాలు వస్తాయన్నారు. సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు పాలకవర్గం ముందు బహిర్గతం చేయాలని ఆయన కోరారు.



**కార్మికులకు పని కల్పించని మాజీ చైర్మన్**

కార్మికులకు పని లేకుండా చేయడంతో తాను వారికి పని కల్పించేందుకు మాత్రమే యారన్ కొనుగోలు చేయడం జరిగిందని చైర్మన్ సత్యం సభ దృష్టికి తెచ్చారు. గత చైర్మన్ అశోక్ కార్మికులకు పని కల్పించకుండా నిర్లక్ష్యం చేసారని ఆరోపించారు. . ఈ సభకు కోశాధికారి టి .వెంకటేశం, కౌన్సిలర్ రాజశేఖర్, డైరెక్టర్లు చిట్యాల మధు, మెట్టు రమేష్, కుమారస్వామి, కిష్టయ్య, ఇందిర, లక్ష్మి సభ్యులు దుర్గారావ్ యాదగిరి, లక్ష్మీనారాయణ, గోలి మహేష్, రాజేందర్, పులగం శ్రీనివాస్, పద్మ సుధీర్, నామ విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీరు, విద్యుత్ సమస్య ఉండకూడదు







- **అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులలో అభివృద్ధి**
- **అన్ని వార్డులలో అభివృద్ధి జరగాలి**

**నర్సాపూర్ సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పురపాలక సర్వసభ్య సమావేశం బుధవారం పురపాలక కార్యాలయంలో జరిగింది పట్టణంలో ప్రధానంగా విద్యుత్, మంచినీరు, సిసి రోడ్లు పారిశుద్ధ్యం అండర్ డ్రైనేజ్ పెండింగ్ పనులు వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు బిజెపి టీఆర్ఎస్ కౌన్సిలర్ల గెలుపొందిన వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులలో అభివృద్ధి పనులు చేస్తున్నారని కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు ఈ సమావేశంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంచి నీటి , కరెంటు సమస్యలు లేకుండా చూడాలని బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా వీధిలైట్లు లేని చోట ఏర్పాటు స్టేడియం నిర్మాణంకు 4.2 కోట్ల నిధులు మంజూరు స్టేడియం ఏర్పాటుకు టెండర్లు పిలవాలని వాలీబాల్ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని డబుల్ బెడ్ రూమ్ లు వెంటనే పంపిణీ చేయాలని నర్సాపూర్ పట్టణంలో కరెంటు సమస్య ఉంది ప్రత్యేకంగా సబ్ స్టేషన్, స్మశాన వాటిక మరమ్మతులు రాయ రావు చెరువు అభివృద్ధి వంటి అంశాలపై సమావేశంలో అధికారులకు సూచన చేశారు మున్సిపల్ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చై ర్మన్ లక్ష్మి రాజు యాదవ్ వైస్ చైర్మన్ భూచేష్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ సాయి కిరణ్, కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# సీఎం నిధితో ఆర్థిక అండ

- **దామోదర్‌కు సీఎం సహాయ నిధి చెక్కు అందజేత..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు, ఇతర అవసరాలను ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తంగా నిలుస్తోంది. ఇందులో భాగంగా బెల్లంపల్లి బస్తీకి చెందిన చందనాల దామోదర్‌కు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో పంపిణీ చేశారు. 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ తన చేతుల మీదుగా దామోదర్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుండటం అభినందనీయమని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ వ్యక్తిగత సహాయకుడు ఇక్బాల్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గం మహేందర్, రామిల్ల ప్రదీప్, అక్కపాక రంజిత్ కుమార్, కాంపెల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరు నెలల్లో రామాయంపేట రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేస్తాం




- మాజీ ఎమ్మెల్యే
- పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపణలకు అధికార పార్టీ నాయకుల కౌంటర్...
- బీఆర్ఎస్ హయాంలో డివిజన్ కాగితాలకే పరిమితమైందని విమర్శలు

రామాయంపేట, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)

మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో ఆరు నెలల్లో పూర్తి స్థాయి రెవెన్యూ డివిజన్ ను తీసుకు వస్తామని రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, కో ఆప్షన్స్ సభ్యుడు దేమే యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాకి స్వామి, పోచమ్మల గణేష్ అన్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వాగ్వాదానికి దారితీస్తోంది. డివిజన్ ఏర్పాటులో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డివిజన్ పేరుతో ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్ ఏర్పాటుకు ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను పరిష్కరిస్తున్నామని, ఆరు నెలల్లో పూర్తిస్థాయి చట్టబద్ధమైన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రజలు అనేక పోరాటాలు, ధర్నాలు చేసిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ ప్రయోజనాల కోసం ఎలాంటి పూర్తిస్థాయి పరిపాలనా వ్యవస్థ లేకుండానే డివిజన్‌ను ప్రకటించారని విమర్శించారు. దీంతో ప్రజలకు వాస్తవ ప్రయోజనం కలగలేదన్నారు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని నాయకులు తెలిపారు. జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లామని చెప్పారు. డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అంశాలను పరిష్కరించి ఆరు నెలల్లో పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు రామాయంపేట పట్టణ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.2.10 కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆద్య హోటల్ వైజంక్షన్ నుంచి బస్వాపూర్ వరకు రహదారి నిర్మాణానికి రూ.38 కోట్ల ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మినీ ట్యాంక్‌బండ్ వద్ద రూ.4.50 కోట్లతో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలో శాశ్వత కోర్టు భవనం ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కౌన్సిల్ ద్వారా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి రామాయంపేట అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు గుప్త, దేవుని రంజిత్, సందీప్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, మహమ్మద్ గౌస్, నాయకులు పోచమ్మల గణేష్, చింతల స్వామి, చింతల యాదగిరి, పిట్ల ప్రకాష్, బుర్ర అనిల్‌కుమార్, తోటవారి యాదగిరి, చిలుకస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్ కేంద్రంగా గంజాయి దందా!




- -ఒడిశా నుంచి నగరానికి అక్రమ రవాణా ఇద్దరి అరెస్టు
- -1.5 కిలోల గంజాయి,సెల్‌ఫోన్లు స్వాధీనం

శేరిలింగంపల్లి,సెప్టెంబర్30(సిరి న్యూస్):

నగరంలో మాదకద్రవ్యాల సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. చందానగర్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో గంజాయి విక్రయానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 1.5 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ప్యాకింగ్‌కు ఉపయోగించే పాలిథిన్ కవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మెరిపాటి మనోజ్‌కుమార్ (22), ఎం. ఆశాజ్యోతి (23)గా పోలీసులు గుర్తించారు. పోలీసులకు అందిన సమాచారంతో చందానగర్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేయగా.. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గుర్తించిన వారు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. విచారణలో ఒడిశాలోని కుందులి ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడైనట్టు పోలీసులు తెలిపారు. నగరంలో వీరికి గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, కొనుగోలు చేస్తున్నవారు, ఈ వ్యవహారం వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న గంజాయి నమూనాలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిన పోలీసులు.. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జోగిపేట, సెప్టెంబర్ 30, (సిరి న్యూస్)

: ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో అందోలు, జోగిపేటకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి గోల్డ్,సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. ఈనెల 29వ తేదిన సిద్దిపేటలో జరిగిన ఈ పోటీల్లో అండర్ 14 పోటీల్లో బాలుర విభాగంలో గోల్డ్‌మెడల్‌ను లచ్చు, సిల్వర్ మెడల్‌లను సృజన్ సింగ్, సృజల్, భగవాన్‌లు సోహం, క్రిష్‌గౌడ్, విరాట్‌లు తృతీయ స్థానాన్ని, శశాంక్ ద్వితీయస్థానాన్ని బాలికల విభాగంలో ప్రణయ గోల్డ్, శృతి సిల్వర్ మెడల్‌లను సాధించారు. అండర్ 17, బాలికల విభాగంలో సిల్వర్ మెడల్‌లను హిందూ, విజయకుమారి, గోల్డ్‌మెడల్‌ను లహరి అండర్ 17, బాలుర విభాగంలో గోల్డ్‌మెడల్‌లను నహిమియా, మణికంఠగౌడ్, శ్రీశాంత్, తేజలు, సిల్వర్ మెడల్‌లను సంజయ్‌కుమార్, చరితలు సాధించారు. గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులు వచ్చేనెల 12 నుంచి 14వరకు హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అందోలు, జోగిపేటకు చెందిన విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్‌లను సాధించడం పట్ల కోచ్ వాసు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా మెడల్‌లను సాధిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్త పరిచారు.

# విద్యార్థి దశ నుండే చట్ట సభలపై అవగాహన కల్గి ఉండాలి





- మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్.

మెదక్ సెప్టెంబర్,30(సిరి న్యూస్)

విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండి చట్టసభల నిర్వహణ, చట్టసభల విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 31 పీఎం శ్రీ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులతో నమూనా పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులే స్పీకర్‌గా, కేంద్ర మంత్రులుగా, అధికారపక్షం, ప్రతిపక్ష సభ్యులుగా పాత్రలు పోషించారు. విద్యార్థి స్పీకర్ సభా కార్యక్రమాలను నిర్వహించగా.. ఎంపీలుగా వ్యవహరించిన విద్యార్థులు వివిధ ప్రజా సమస్యలను లేవనెత్తుతూ ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులుగా ఉన్న విద్యార్థులు సమాధానాలు ఇవ్వడంతో అచ్చం పార్లమెంట్‌ను తలపించేలా సభా కార్యక్రమాలు నడిపించడంతో అక్కడ ఉన్న అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, మాట్లాడే నైపుణ్యం, తార్కిక ఆలోచన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తి పెంపొందించేందుకు దోహదపడుతుందని అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏ ఏం ఓ సుదర్శన మూర్తి, సోషల్ ఫోరం సభ్యులు నర్సింలు, దేవి సింగ్ ప్రభాకర్, భూలి భాయ్, సంగీత ,ప్రసాద్ రెడ్డి, చల్లా లక్ష్మణ్, లింగమయ్య మరియు న్యాయ నిర్ణేతలుగా గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్,శ్రీనివాస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో ఐదు ఎకరాల్లో మోడల్ మార్కెట్



- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మార్కెట్ అభివృద్ధి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

కొల్లూరు ప్రాంతంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐదు ఎకరాల విస్తీర్ణంలో మోడల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కొల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 203లో మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. పెరుగుతున్న జనాభా, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా అన్ని మౌలిక వసతులతో ఆధునిక మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. భూ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, అవసరమైన భూమిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతిని ఆదేశించారు. ప్రజలు, వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. కొల్లూరు ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గీతంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2026

పటాన్ చెరు, సెప్టెంబర్ 30, (సిరి న్యూస్):

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తిపరమైన సలహాల విభాగం (టీఎంసీజీ), ప్రత్యామ్నాయ వృత్తి సేవల విభాగం ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ను నిర్వహించింది. విదేశాలలో శరదృతువు (ఫాల్) 2027లో ఉన్నత విద్యా ప్రవేశాల కోసం చేపట్టే అడ్మిషన్ల ప్రక్రియపై సంపూర్ణ అవగాహనను కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. ఈ ఫెయిర్ లో ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, సింగపూర్, స్విట్జర్లాండ్, యూకే, యూఎస్ చెందిన పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులకు మాస్టర్స్ ప్రోగ్రామ్ వివరాలను తెలుసుకోవడానికి, ప్రవేశ ప్రక్రియను అర్థం చేసుకోవడానికి, స్కాలర్ షిప్పులు, ఆర్థిక సహాయం, దరఖాస్తు విధానాలపై అవగాహన పొందడానికి ఇది వీలు కల్పించింది. ఆయా విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో విద్యార్థులు ముఖాముఖి సంభాషించి, ఆయా కోర్సులలో చేరడానికి తగిన మార్గదర్శనంతో పాటు ఫీజు మినహాయింపు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.




## సెల్ ఫోన్ కోసం యువకుడి దారుణ హత్య

వెల్దుర్తి,సెప్టెంబర్ 30,(సిరి న్యూస్ ):




వెల్దుర్తి మండలం మన్నెవరు జలాల్పూర్ గ్రామంలో రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో, బ్యాగరి రామనుజం, తండ్రి సాయిలు, వయస్సు 42 సంవత్సరాలు, అనే వ్యక్తిపై కొంతమంది వ్యక్తులు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామంలో జరిగిన గణేశ్ ఉత్సవాల సందర్భంగా మృతడు సెల్‌ఫోన్ దొంగిలించాడనే అనుమానంతో, అదే గ్రామానికి చెందిన గుండ్ల ప్రవీణ్ తో మరో ఎనిమిది మంది కలిసి రామనుజాన్ని పట్టుకుని కింద పడేసి, విచక్షణారహితంగా దాడి చేసినట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రామనుజం రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో మృతి చెందినట్లు సమాచారం తెలుసుకున్నారు. వెల్దుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. ఇట్టి సంఘటన కీ సంబంధించి తుప్రాన్ సిఐ వెంకట్ రాజ్ గౌడ్, విచారణ చేపట్టి మన్నేవార్ జలాలపూర్ గ్రామానికి చెందిన అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిపారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## మాదాపూర్ సర్వీస్ అపార్ట్మెంట్లపై పోలీసుల ఉక్కుపాదం!

- పార్టీల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 30(సిరి న్యూస్):




మాదాపూర్ పరిధిలో సర్వీస్ అపార్ట్‌మెంట్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని బర్త్‌డే పార్టీలు, ఇతర కార్యక్రమాల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు పోలీసుల దృష్టికి రావడంతో తనిఖీలు ముమ్మరం చేశారు. గత రెండు, మూడు రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో రెండు కేసులు నమోదు చేసినట్లు మాదాపూర్ ఎస్‌హెచ్ఓ కేవీ సుబ్బారావు తెలిపారు.సర్వీస్ అపార్ట్‌మెంట్లలో జరుగుతున్న కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో గ్యాంబ్లింగ్‌కు సంబంధించి రెండు కేసులు నమోదు కాగా, వ్యభిచారానికి సంబంధించిన మరో కేసు కూడా వెలుగులోకి వచ్చినట్లు ఎస్‌హెచ్ఓ వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ సర్వీస్ అపార్ట్‌మెంట్లను అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# శివ్వంపేట్ మండలం అల్లీపూర్ గ్రామానికి 25 ఎల్ఈడి లైట్ల పంపిణీ



- దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి * సహకారం తో అల్లీపూర్ గ్రామానికి 25 ఎల్ఈడి లైట్స్ అందజేత

**శివంపేట్ సెప్టెంబర్ 30 ( సిరి న్యూస్ )**

శివంపేట్ మండల్ సర్పంచ్ ఫోరమ్ ప్రెసిడెంట్, పిల్లుట్ల గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, యూవ నాయకులు బొమ్మిడాల శంకర్ ఆధ్వర్యంలో ఎల్ఈడి లైట్స్ పంపిణి కార్యక్రమం నిర్వహించి, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్ అందజేశారు. గ్రామాల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరించి, వెలుగులు నింపేందుకు ఈ చర్యలు ఎంతగానో దోహదపడతాయన్నరూ ఈ కార్యక్రమంలో,పిల్లుట్ల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి ,అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్ ,ఉప్ప సర్పంచ్ చిన్న కృష్ణ , వార్డు సభ్యులు పిల్లి మధు ,తలారి హనుమంతు,బుర్ర సత్యం గౌడ్, గుల్లయిగారి రవి, గొల్ల మహేష్, సంద్ర విష్ణు, గొల్ల మల్లేష్, హంసనపల్లి భావీణ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు. ...

# అమిత్ షా పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



- వెంకటాపూర్ శివారులోని అమూల్ పాల కంపెనీ భూమిపూజ కార్యక్రమం నిర్వహించే స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**తూప్రాన్ సెప్టెంబర్ 30 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ 10 వ వార్డ్ వెంకటాపూర్ శివారులోని రైల్వే గేట్ వద్ద అమూల్ పాల కంపెనీ భూమిపూజ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న హాజరుకానున్న నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ బుధవారం కార్యక్రమ ప్రదేశాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ సందర్భంగా కార్యక్రమ వేదిక వీవీఐపీ రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వీవీఐపీ భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజలు, వీఐపీల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు.

కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

వీవీఐపీ పర్యటన నేపథ్యంలో విధులు నిర్వహించే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ సీఐలు సందీప్ రెడ్డి, రంగకృష్ణ, ఆర్ఐ శైలేందర్ ఎస్ఐలు గంగా రాజు సుభాష్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు

# సఫాయి మిత్రలకు ఆరోగ్య పరీక్షలు, ఘన సన్మానం..




**హత్నూర, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా హత్నూర మండల కార్యాలయంలో సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శిబిరాలను బుధవారం నిర్వహించారు.ఎస్ బి ఎం జిల్లా కోఆర్డినేటర్ స్వామి పాల్గొని సఫాయి మిత్రల సేవలను అభినందించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీడబ్ల్యూ స్వచ్ఛ సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ సిబ్బందికి వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య

పరిస్థితిని పరిశీలించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణలో అంకితభావంతో, సమర్థవంతంగా పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ సిబ్బందిని గుర్తించి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత, పారిశుధ్య పరిరక్షణలో సఫాయి మిత్రలు అందిస్తున్న సేవలను అధికారులు అభినందించారు. తడి, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైలు ప్రమాదంలో గొర్రెల మృతి బాధితులను.. ఆదుకోవాలి

- చనిపోయిన గొర్రెలకు బీమా, నష్టపరిహారం చెల్లించాలి
- గాయపడిన గొర్రెలకు వెంటనే చికిత్స అందించాలి
- స్పందించని రెవెన్యూ, వెటర్నరీ అధికారులపై సీపీఎం నేతల ఆగ్రహం
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం

**రామాయంపేట, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**



రైలు ప్రమాదంలో గొర్రెలను కోల్పోయిన రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోకట్ల రెడ్డయ్య అలియాస్ యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం డిమాండ్ చేశారు. గొర్రెలే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న బాధితుడికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం వెంటనే అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సీపీఎం నాయకులు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ రైలు ప్రమాదంలో 46 గొర్రెలు మృతి చెందగా, మరో 25 గొర్రెలు గాయాలతో చావుబతుకుల మధ్య ఉన్నాయని తెలిపారు. మొత్తంగా సుమారు 65 గొర్రెలు నష్టపోవడంతో రెడ్డయ్య కుటుంబం తీవ్రంగా నష్టపోయిందన్నారు.

**వెటర్నరీ అధికారులు స్పందించలేదని ఆరోపణ..**

ప్రమాదం జరిగిన అనంతరం గాయపడిన గొర్రెలకు స్థానిక వెటర్నరీ అధికారులు సకాలంలో చికిత్స అందించలేదని సీపీఎం నాయకులు ఆరోపించారు. ప్రమాద తీవ్రతను గుర్తించి వెంటనే వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన గొర్రెలకు తక్షణమే వైద్యం అందించాలని కోరారు. రెవెన్యూ అధికారులు ప్రమాద స్థలాన్ని సందర్శించినప్పటికీ చనిపోయిన, గాయపడిన గొర్రెలకు సంబంధించిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయలేదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గొర్రెలను కోల్పోయిన కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలిపారు.

**రూ.5 లక్షల పరిహారం చెల్లించాలి**

చనిపోయిన గొర్రెలకు బీమా పరిహారం అందించడంతో పాటు బాధిత కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సుర్ణ బీరయ్య, కోకట్ల బీరయ్య, బియా స్వామి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్లను సన్మానించిన బిజెపి నాయకులు

- సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా అంగన్వాడి సేవ మిలన్

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 30, (సిరి న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలో అంగన్వాడీ టీచర్లను బుధవారం సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షులు కోణం విఠల్. మండల బిజెపి అధ్యక్షులు శ్రావణ్ కుమార్ లు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవం పురస్కరించుకొని సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో పేద మధ్య తరగతి కుటుంబాలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం ముందు వచ్చిన పాలు గుడ్లు పౌష్టిక ఆహారం అందించడంతోపాటు వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి వారి యొక్క ఆలనా పాలన చూడడంలో అంగన్వాడీ టీచర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వారు అందిస్తున్న సేవలకు గాను సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లను శాలువాలతో సన్మానించడం తో పాటు మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, నాయకులు రామరాజు, సాయిలు పటేల్, అనిల్ కుమార్, వెంకయ్య, బోలా శంకర్, ఆంజనేయులు, భూషణం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు.. రూ.10 వేల జరిమానా !!!!

- శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

**శివంపేట్ సెప్టెంబర్ 30 ( సిరి న్యూస్ )**




అదనపు కట్నం కోసం భార్యను వేధించి, చివరకు రాయితో తలపై కొట్టి హత్య చేసిన భర్తకు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించిందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. శివంపేట మండలం కొత్తపేటకు చెందిన బుచ్చ అశోక్‌కు అల్లీపూర్‌కు చెందిన మినాతో సుమారు మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో కిలో వెండి, 8 తులాల బంగారం, మోటార్‌సైకిల్‌తో పాటు రూ.50 వేల నగదును కట్నంగా ఇచ్చారు. వివాహమైన ఐదు నెలల తర్వాత అశోక్ అదనపు కట్నం కోసం మినాను మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించినప్పటికీ వేధింపులు ఆగలేదు. రూ.లక్ష అదనపు కట్నం కావాలని డిమాండ్ చేస్తూ 22.01.2023న మినాను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. 02.03.2023న ఉదయం 10 గంటల సమయంలో మినా తన తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి భర్త ఇంటికి వెళ్లింది. ఈ సందర్భంగా పంచాయతీ పెట్టి తన పరువు తీస్తోందనే కోపంతో అశోక్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన మినాను నర్సాపూర్‌లోని పద్మజ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కూకట్‌పల్లిలోని పద్మజ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 05.03.2023న మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రవికాంత్ కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి, తూప్రాన్ సీఐ శ్రీధర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, శివంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు బుచ్చ అశోక్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు





- మల్లెచెరువు కట్ట వద్ద మున్సిపల్ కౌన్సిలర్ ల పరిశీలన.

**రామాయంపేట, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రామాయంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశాల మేరకు మల్లె చెరువు కట్టను బుధవారం పూర్తిగా పరిశీలించారు. బతుకమ్మ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కట్ట పరిసరాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, రహదారి పనులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు.మల్లె చెరువు కట్ట వద్ద తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ సిబ్బందికి సూచించారు. మహిళలు రాత్రి వేళల్లో సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి మల్లె చెరువు కట్ట రోడ్డు పనులను పరిశీలించారు. పెండింగ్‌లో

ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి, పండుగలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కట్ట పరిసరాల్లో పారిశుధ్యం, విద్యుత్ వెలుగులు, రహదారి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, చింతల యాదగిరి, చింతల స్వామి, మాజీ కౌన్సిలర్ బుర్ర అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి తో పాటు మున్సిపల్ అధికారులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి ని పొదుపుగా వాడుకుందాం

- కుస్నూర్ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్

రాయికోడ్, సెప్టెంబర్ 30(సిరిన్యూస్): ఎల్‌నినో ప్రభావం వల్ల లోటు వర్షపాతం ఉన్నందున మంచి నీటిని పొదుపుగా వాడుకుందామని రాయికోడ్ మండలం కుస్నూర్ గ్రామ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం కుస్నూరు గ్రామంలో ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారుల ఆధ్వర్యంలో జల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి యొక్క ప్రాముఖ్యత, ఏ నీరు శరీరానికి మంచిది అని లాబ్ సిబ్బందితో బల్బు టెస్టు ద్వారా గ్రామ సభలో వివరించారు. ఎల్నినో ప్రభావం ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలెను అని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ ప్రవీణ్, ఏఈఈ సాయి ప్రణీత్, పంచాయితీ సెక్రటరీ చంద్రశేఖర్, కెమిస్ట్ జైపాల్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తేనెటిగలా పెంపకం పై మహిళా రైతులకు శిక్షణ

**తూప్రాన్ సెప్టెంబర్ 30 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం లోని మల్కాపూర్ గ్రామపంచాయతి కార్యాలయంలో ఆత్మ కమిటీ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో బుధవారం మహిళ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి శిక్షణ కార్యక్రమంలో భాగంగా తేనేటిగల పెంపకం గురించి, తేనే పరిశ్రమల గురించీ, తేనే తీసిన తరువాత ఆరు రకాల బైప్రొడక్ట్స్ గురుంచిమరియు పంట పాటు అదనపు ఆదాయం కూడా రైతులు పొందవచ్చును.దాని లాభాలు గురించి K. ఇందిరారెడ్డి తెలంగాణా పౌండర్ చాలా వివరంగా తెలిపినారు.సేంద్రియ వ్యవసాయము దాని వలన కలుగు లాభాలు మరియు



జీవన ఎరువుల గురించి,రాబోయే యాసంగిలో వేసుకొబోయే పంటల గురించి వివరంగా తెలిపినారు.

మండల వ్యవసాయ అధికారి పి.గంగా మల్లు ఈ యాసంగిలో వేసుకొబోయే పంటల గురించి తెలుపుతూ వరి కి బదులుగా ఆరుతడిపంటలు వేసుకోవాలని సూచించారు.అలాగే నూనె గింజల పంటలను మరియు పప్పు దినుసు పంటలు సాగు చేయడానికి మొగ్గు చూపాలని రైతులకు సూచించారు.అలాగే ఒక ఎకరం వరిని సాగు చేయడానికి బదులుగా రెండు మూడు ఎకరాల అరుతడి పంటలను వేయాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో k. ఇందిరారెడ్డి తెలంగాణా బి ఆబ్ సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ మల్కాపూర్ సర్పంచ్ పంజలా ఆంజనేయులు గౌడ్ ఉప సర్పంచ్ మండల వ్యవసాయ అధికారి గంగా మల్లు హరీష్ అభిలాష్ గౌడ్ ఏటీఎం సింధు, మల్కాపూర్ విమెన్ ఫార్మర్స్ 90పాల్గొన్నారు.

# అక్కన్నపేట ప్రజల సమస్యపై స్పందించిన జిల్లా కలెక్టర్





- **రెండు అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి రైల్వే అధికారుల హామీ**

**రామాయంపేట, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో సికింద్రాబాద్-బాంబే రెండో రైల్వే లైన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అదేవిధంగా మెదక్-ఎల్కతుర్తి నేషనల్ హైవే పనులు కూడా కొనసాగుతున్న నేపథ్యంలో అక్కన్నపేట గ్రామంలో రైల్వే గేటును మూసివేసి, బైపాస్ రోడ్డు ద్వారా రాకపోకలు కొనసాగించే విధంగా అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఒకే అండర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల అక్కన్న పేట గ్రామ ప్రజలు తమ పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ పనులు చేసుకునేందుకు, దేవాలయాలకు, చెరువుకు, వైకుంఠధామానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను అక్కన్నపేట గ్రామ ప్రజల తరపున మెదక్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సమస్య తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత రైల్వే అధికారులకు సమాచారం అందించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అక్కన్నపేటలో రెండు అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైల్వే శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు, సాంకేతిక నిపుణుల బృందం అక్కన్నపేట గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిశీలించింది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు అండర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు చర్యలు



తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. రెండు అండర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే అక్కన్నపేట గ్రామ ప్రజలకు తమ పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ పనులు చేసుకునేందుకు, దేవాలయాలు, చెరువు, వైకుంఠధామానికి సులభంగా రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందించిన మెదక్ జిల్లా కలెక్టర్ కు రైల్వే అధికారులకు అక్కన్నపేట గ్రామ ప్రజల తరపున గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఇంగార్తి రంగయ్య, కిసాన్ మోర్చా నాయకులు ఎలగారి అశోక్, గాజుల యాదగిరి, పెద్ద రాములు, బక్కయ్య గారు, చిన్న గంగ రాములు, అనుముల రాజు పాల్గొన్నారు.

# పోరాటంతోనే ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం



- **ఉద్యోగ సంఘాలు చురుగ్గా పనిచేయాలి**
- **పీఆర్‌సీ, డీఏలు, బకాయిల సాధనకు ఐక్య ఉద్యమాలు అవసరం**
- **ఉద్యోగుల పోరాటాలకు సంపూర్ణ మద్దతు**
- **జెల్ల సుధాకర్ పోరాట స్ఫూర్తి ఆదర్శం**
- **తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్):**

ఉద్యోగులు తమ న్యాయమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా, చురుగ్గా పోరాడాలని, ఉద్యమాల ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురాగలమని తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. టీఎన్జీవో నేత జెల్ల సుధాకర్ పదవి విరమణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ సంఘాలు పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఇటీవల వివిధ ఉద్యోగ సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి జేఏసీగా ఏర్పడి చేపట్టిన కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఐక్యతను పెంచాయని పేర్కొన్నారు. సంఘాలు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సమస్యల పరిష్కారం వరకు ఉద్యమాలు కొనసాగించాలని సూచించారు. “ఉద్యోగులు పోరాడకపోతే వారి సమస్యలు పరిష్కారం కావు. సంఘాలు చురుగ్గా పనిచేస్తూ ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకురావాలి. గతంలో ఉద్యోగుల ఉద్యమాలకు మద్దతుగా నిలిచాను. ప్రస్తుతం కూడా, భవిష్యత్తులో కూడా ఉద్యోగుల న్యాయమైన పోరాటాలకు నా సంపూర్ణ మద్దతు ఉంటుంది” అని స్పష్టం చేశారు.

**సుధాకర్ సేవలు అభినందనీయం**

జెల్ల సుధాకర్ ఉద్యోగ జీవితంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడంతో పాటు సామాజికంగా అనేక కార్యక్రమాలు, ఉద్యమాల్లో పాల్గొన్నారని ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని, పోరాట పటిమ కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంతోనే ఆయన సేవలు ముగిసిపోవని, రిటైర్మెంట్ తర్వాత కూడా సామాజిక కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాల్లో మరింత చురుగ్గా పాల్గొంటారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.రిటైర్మెంట్ అంటే విశ్రాంతి మాత్రమే కాదుఉద్యోగ విరమణ తర్వాత ప్రతి వ్యక్తి “ఉద్యోగం పోయింది” అనే భావనతో ఇంటికే పరిమితం కాకుండా సమాజానికి మరింత దగ్గర కావాలని సూచించారు. రిటైర్మెంట్ అనంతరం సామాజిక సేవలు, ప్రజా ఉద్యమాలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వ్యక్తిగతంగా చురుకుదనం పెరగడంతో పాటు ఆరోగ్యపరంగానూ మేలు జరుగుతుందని పేర్కొన్నారు.“ఇంట్లోనే ఉండిపోతే ఒంటరితనం, నిరుత్సాహం పెరిగే అవకాశం ఉంటుంది. సమాజంలో తిరుగుతూ ప్రజల సమస్యల్లో భాగస్వాములైతే మనం సమాజానికి ఉపయోగపడటంతో పాటు మన జీవితానికీ కొత్త ఉత్సాహం వస్తుంది” అని అన్నారు.

**మేధావులు సమాజానికి మార్గదర్శకులు కావాలి**

ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవం, విజ్ఞానాన్ని రిటైర్మెంట్ తర్వాత సమాజానికి ఉపయోగించాలని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులు, మేధావులు ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సేవ, యువతకు మార్గదర్శకత్వం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. తాను కూడా రిటైర్మెంట్ అనంతరం సామాజిక కార్యక్రమాల్లో కొనసాగుతున్నానని పేర్కొంటూ, సుధాకర్ కూడా అదే బాటలో ముందుకు సాగుతారనే నమ్మకం ఉందన్నారు. “సుధాకర్ ఇంటికే పరిమితమయ్యే వ్యక్తి కాదు. ఆయనలో ఉన్న పోరాట స్ఫూర్తి, సామాజిక బాధ్యత ఆయనను ప్రజల మధ్యే ఉంచుతాయి. భవిష్యత్తులోనూ సామాజిక ఉద్యమాల్లో ఆయన క్రియాశీలంగా పాల్గొంటారని నమ్ముతున్నాను” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా టిఎన్జీవో అధ్యక్షుడు జావేద్, పూర్వ అధ్యక్షులు మేడిశెట్టి శ్యామ్ రావు, జిల్లాలోని ఉద్యోగులు, సంఘాల నేతలు పాల్గొన్నారు.





# గొర్రెలు మృతి.. బాధిత కుటుంబానికి పద్మాదేవేందర్‌రెడ్డి భరోసా..



- **రూ.10 వేల ఆర్థిక సాయం.**

**రామాయంపేట, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్)**

ప్రమాదవశాత్తు లక్ష్మాపూర్ రైల్వే ట్రాక్ వద్ద 40 గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. తొనిగండ్లకు చెందిన కోకట్ల యాదయ్య, బీరయ్యలకు చెందిన గొర్రెలు మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మండల యువజన అధ్యక్షుడు రాగి ఉమా మహేశ్వర్, తొనిగండ్ల భూమలింగం, సిద్ధారములు, లక్ష్మాపూర్ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ సాగర్, శ్రవణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాపల్లిలో అమెజాన్ అభివృద్ధి అద్భుతం..



- **కోట్లతో పాఠశాలల రూపురేఖలే మారాయ్!**
- **ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య, అమెజాన్ ప్రతినిధులు**

**షాబాద్, సెప్టెంబర్ 30:**

షాబాద్ మండలం తల్లాపల్లి గ్రామంలో అమెజాన్ కంపెనీ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, రిసోర్స్ సెంటర్, భవిత కేంద్రం మరియు నూతనంగా నిర్మించిన డైనింగ్ హాళ్లను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య, అమెజాన్ విదేశీ ప్రతినిధి గాయత్రి ప్రభు, అమెజాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు అమెజాన్ కంపెనీకి చెందిన విదేశీయులు 30 దేశాల వారు హాజరయ్యారు. వీరితో పాటు డీఈవో, జిల్లా లైబ్రరీ చైర్ పర్సన్ ఏలుగంటి మధుసూదన్ రెడ్డి, ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయి, కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు, ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. అమెజాన్ కంపెనీ వారు చేవెళ్ల నియోజకవర్గంలో ఇప్పటికే 30 పాఠశాలలను పునరుద్ధరించి ఎంతో సహకారం అందించారని అన్నారు. వారి సహాయ సహకారాలతో షాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, పార్కులు ఇలా అనేక రకాలుగా అభివృద్ధి చేశారని కొనియాడారు. జిల్లా లైబ్రరీ చైర్ పర్సన్ ఏలుగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. అమెజాన్ కంపెనీ గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వారి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్ రెడ్డి వారి పేతుల మీదుగా విద్యార్థులకు ల్యాబ్ టాప్లు అందించారు. గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది.





# వందేళ్లు బతికే సీక్రెట్ ఈ దేశస్తులకే తెలుసు..!



మనిషి ఆయువు వందేళ్లంటారు. ఒకప్పుడు మన పూర్వికులు ఆయుష్షులో 'సెంచురీ'లు కొట్టేసేవారని మన పెద్దలు అప్పుడప్పుడు చెబుతూ ఉంటారు. కానీ, ప్రస్తుతం ఉన్న జీవన విధానంలో మార్పుల కారణంగా సరాసరి ఆయుష్షు 70 ఏళ్లు మించడం లేదు. లైఫ్‌స్టైల్, రోగాలు, దురాలవాట్లతో చాలా మంది చిన్న వయస్సులోనే జీవితాన్ని ముగిస్తున్నారు. హార్ట్ స్ట్రోక్ మరణాలు ఎక్కువవుతున్నాయి. ఉన్నట్టుండే మనుషులు కుప్పకూలుతున్నారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ ఎలా పోతారో ఎవరికీ అర్థం కావడం లేదు. వీటన్నిటి నడుమ ప్రశాంతంగా ఓ అరవై ఏళ్లు బ్రతకడం కూడా కష్టమవుతోంది. మరి ఎక్కడైనా 80 ఏళ్లకు పైనే జీవించే వారు ఉన్నారా..? అంటే అందరూ ఈ దేశాలవైపే చూస్తున్నారు. మరి ఆ దేశాలు ఏమిటో తెలుసుకుందాం.



ముందుగా దక్షిణ కొరియానే చెప్పుకోవాలి. ఎందుకంటే ఇక్కడ సగటు ఆయుర్థాయం 90పైమాటే అంటా. ప్రపంచంలో 90ఏళ్లు సగటు ఉన్న తొలి దేశంగా దక్షిణ కొరియా రికార్డు సృష్టించింది. ఈ దేశం బలమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఆదర్శంగా నిలుస్తోంది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఇక్కడి ప్రజలకు తక్కువ రక్త పోటు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ఉన్నాయి. కొరియన్లు ఎక్కువగా పులియబెట్టిన ఆహారాన్ని డైట్ గా తీసుకుంటారు. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, క్యాన్సర్ ను నివారిస్తూ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. వీరు బౌద్ధ మతాన్ని ఆచరిస్తారు. దీనివల్ల వీరు ఒత్తిడి ఆందోళన దూరంగా ఉంటారు.

## స్పెయిన్

స్పెయిన్ లో సగటు ఆయుర్థాయం 82.8 సంవత్సరాలు. స్పెయిన్ కూడా జపాన్ మాదిరిగానే ఉంటుంది. స్పానిష్ ప్రజల అధిక ఆయుర్థాయానికి కారణం వారి మెడిటేరియన్ డైట్. ఆలివ్ ఆయిల్ - కూరగాయలు - వైన్ వంటివి గుండెకు మేలు చేకూరుస్తాయి. అరగంట భోజన విరామానికి బదులుగా 2నుంచి 3గంటల విరామం తీసుకుంటారు. వీరంతా వాహనాలను వినియోగించడం కంటే నడకకే ప్రాధాన్యమిస్తారు.



## జపాన్

జపానీయులు ఎక్కువ కాలం జీవిస్తారనే చాలా మందికి తెలుసు. వీరి సగటు ఆయుర్థాయం 83సంవత్సరాలు. జపాన్ ను అమర వీరుల భూమిగా పిలుస్తారు. జపాన్ ప్రజలు అత్యున్నత నాణ్యమైన జీవనాన్ని కలిగి ఉంటారు. వీరు తీపి బంగాళదుంపలు, చేపలు, రిచ్ డైట్ తీసుకుంటారు. జపాన్లో ప్రాచీనం నాటి సంస్కృతులు పాటిస్తూ ప్రాచీన ఆహారాన్ని తీసుకుంటుండడం వారి ఆయుర్థాయం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.



## స్విట్జర్లాండ్

స్విట్జర్లాండ్ లో ప్రజల సగటు ఆయుర్థాయం 81 సంవత్సరాలు. స్విట్జర్లాండ్ ఐరోపాలోని సంపన్న దేశాలలో ఒకటి. ఆరోగ్య సంరక్షణ బలమైన వ్యక్తిగత భద్రత ప్రజా శ్రేయస్సు వంటివి ప్రజలు ఎక్కువ కాలం జీవించేందుకు దోహదపడుతున్నాయి. చీజ్, డైరీ ఉత్పత్తులను తీసుకుంటారు. స్విట్జర్లాండ్ వృత్తి ఆధారిత దేశం. ఇక్కడి ప్రజలు వీకెండ్స్ లో ప్రయాణాలను ఎంజాయ్ చేస్తూ గడుపుతుంటారు.





# శ్వాస తీసుకోకుండా బతికే జీవి ఇదే!

ప్రపంచంలో చాలా వింత జీవులు ఉన్నాయి. ఇవి వాటి ప్రత్యేకతలకు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందాయి. భూమ్మీద బతకడానికి ప్రతి జంతువు ఆక్సిజన్ పీల్చుకోవాల్సిందేనని చిన్నప్పటి నుంచి చదువుకుంటూనే ఉన్నాం. అది నీటిలో కరిగిన ఆక్సిజన్ అయినా కావొచ్చు, లేదా గాలిలో వాయువు రూపంలోనైనా కావొచ్చు. కానీ కొత్తగా ఆక్సిజన్ పీల్చుకోకుండా బతుకుతున్న ఓ చిన్న జంతువును ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.



**ప్రపంచంలో చాలా వింత జీవులు ఉన్నాయి. ఇవి వాటి ప్రత్యేకతలకు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందాయి. భూమ్మీద బతకడానికి ప్రతి జంతువు ఆక్సిజన్ పీల్చుకోవాల్సిందేనని చిన్నప్పటి నుంచి చదువుకుంటూనే ఉన్నాం. అది నీటిలో కరిగిన ఆక్సిజన్ అయినా కావొచ్చు, లేదా గాలిలో వాయువు రూపంలోనైనా కావొచ్చు. కానీ కొత్తగా ఆక్సిజన్ పీల్చుకోకుండా బతుకుతున్న ఓ చిన్న జంతువును ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.**

హెన్నెగువా సాల్మినికోలా అని పిలిచే ఈ జీవి శరీరం కేవలం పది కణాలతో నిర్మితమై ఉంటుంది. ఇది ఆక్సిజన్ లేకుండా జీవించగలదు. ప్రపంచంలో ఇదే దీని ప్రత్యేక లక్షణం. ఉన్న ప్రపంచంలో ఇలా జీవించే మొదటి జీవి. జెల్లీ ఫిష్ లాగా కనిపించే ఈ బహుళ సెల్యులార్ పరాన్నజీవికి మైటోకాన్డ్రియల్ జన్యువు లేదు. శాస్త్రవేత్తల చెప్పినదాని ప్రకారం ఈ జీవి తన చుట్టూ ఉండే చేపల నుండి శక్తిని పొందుతుంది. కానీ ఈ సమయంలో అది వారికి ఏ విధంగానూ హాని కలిగించదు. మరో ప్రత్యేక విషయం ఏమిటంటే చేపలు కూడా ఈ పరాన్నజీవికి హాని కలిగించవు. ఈ పరాన్నజీవులు సాల్మన్ చేపల గుంపులో కనిపిస్తాయి. తన చుట్టూ చేపలు సజీవంగా ఉన్నంత కాలం అవి జీవిస్తూ ఉంటాయి.



**పరిశోధన సమయంలో శాస్త్రవేత్తలు మైక్రోస్కోప్ తో ఈ జీవిని గమనించినప్పుడు, వారికి అందులో మైటోకాన్డ్రియల్ డీఎన్ఏ కనిపించలేదు. దీని తర్వాత ఇది ప్రపంచంలోనే మొదటి జీవి అని స్పష్టమైంది. ఈ జీవి మానవులకు లేదా ఇతర జీవులకు అస్సలు హాని కలిగించదు. అయినప్పటికీ, ఆక్సిజన్ లేకుండా జీవించగలిగే అటువంటి జీవి భూమిపై ఎలా ఉద్భవించిందో ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. ఈ పరాన్నజీవి మరొక లక్షణం ఏమిటంటే ఇది స్వచ్ఛమైన నీటితోపాటు ఉప్పు నీటిలో కూడా జీవించగలదు. అందుకే దీనిని మైక్సోజోవాన్ అంటారు.**

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి
People's Voice వార్తపత్రిక

గురువారం
అక్టోబర్-01-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 272

పేజీలు : 5

# హోటల్ భోజనం.. ఆరోగ్యానికి భారం

## బయట మెరిసే హోటళ్లు..
## లోపల అపరిశుభ్రత

- నిల్వ ఆహారం, పాడైన ముడిసరుకులతో వంటలు
- ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో వెలుగులోకి వస్తున్న విస్తుపోయే నిజాలు

5





దొంగతనం కేసులో విచారణ పేరిట శేఖర్‌ను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు




# ఆ ఎస్సై తీరే వేరు!

## కాంట్రవర్సీకి కేరాఫ్ జహీరాబాద్ ఎస్సై లవ్ కుమార్

- రాత్రంతా విచారణ.. మరుసటి రోజూ రావాలనడంతో తీవ్ర భయాందోళన
- ఇంట్లో ఉరివేసుకుని 30 ఏళ్ల యువకుడు ఆత్మహత్య
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం
- పోలీసుల వేధింపులే ప్రాణం తీశాయంటూ బాధితుల ఆందోళన
- ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి ఠాణా ఎదుట ధర్నా
- శేఖర్ బలవన్మరణంపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్
- గతంలోనూ భూవివాదంలో యాదయ్య అనుమానాస్పద మృతి
- అచ్చంపేటలో ఏసీబీ ట్రాప్, సస్పెన్షన్.. అయినా మారని తీరు
- లవ్ కుమార్‌ను విధుల నుంచి తప్పించాలని నిరసనలు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ లవ్ కుమార్ వ్యవహారశైలి, విధి నిర్వహణ తీరుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, సాధారణ అనుమానితుల పట్ల కనీస సంయమనం లేకుండా దురుసుగా వ్యవహరిస్తున్నారని, విచారణ పేరుతో తీవ్ర స్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ పలువురు బాధితులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తించాల్సిన పోలీస్ వ్యవస్థపై సామాన్య ప్రజల్లో భయాందోళనలు రేకెత్తే పరిస్థితి ఏర్పడటం మంచిది కాదని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఠాణా భయపెట్టే కేంద్రంగా మారకూడదని స్థానిక వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

(నిఘా విభాగం-సిరిన్యూస్)

4



# రూముల్లో మద్యం.. మత్తులో దాడులు!

## సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో పర్యవేక్షణ లోపం

- విచక్షణ కోల్పోయి తోటి విద్యార్థులపై దాష్టీకాలు
- రాత్రిళ్లు జోగిపేట, ఎంఎన్ఆర్ చౌరస్తా, సంగారెడ్డి దాబాలు, బార్లలో విచ్చలవిడిగా తాగుడు
- సమయపాలన లేకుండా అర్ధరాత్రి వేళల్లో క్యాంపస్‌లోకి రాకపోకలు
- ఏకంగా హాస్టల్ గదుల్లోకే మద్యం సీసాలు..
- తెల్లవార్లూ తాగుతున్న విద్యార్థులు
- అకృత్యాలు భరించలేకే రోడ్డెక్కిన తోటి విద్యార్థులు
- హాస్టళ్లలో కనిపించని వార్డెన్ల వివరాలు
- కనీసం అందుబాటులో లేని హెల్ప్‌లైన్ నంబర్లు
- కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే గాడినపడనున్న ప్రతిష్ట

2

# అసైన్డ్ భూమికి నోటీసుల షాక్ !

## ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్‌కు, భూ పట్టాదారుకు షోకాజ్

- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశం
- పట్టా రద్దు.. భూమి స్వాధీనంపై వివరణ కోరిన అధికారులు

3

'సిరి' కథనానికి స్పందన









సంగారెడ్డి జిల్లా అందోలుజోగిపేట నియోజకవర్గ పరిధిలోని చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సాంకేతిక విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాల్సిన ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో క్రమశిక్షణ పూర్తిగా గాల్లో కలిసిపోయింది. కళాశాల యాజమాన్యం, హాస్టల్ నిర్వాహకుల ఉదాసీనత వల్లే కొందరు విద్యార్థులు పెడదోవ పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్యాంపస్ పరిధిలో సెక్యూరిటీ నిఘా కొరవడటంతో విద్యార్థులు ఎప్పుడు బయటకు వెళ్తున్నారో, ఎప్పుడు లోపలికి వస్తున్నారో పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. (జోగిపేట-సిరి న్యూస్)

# రూములో మద్యం.. మత్తులో దాడులు!

## సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో పర్యవేక్షణ లోపం

- విచక్షణ కోల్పోయి తోటి విద్యార్థులపై దాష్టీకాలు
- రాత్రిళ్లు జోగిపేట, ఎంఎన్‌ఆర్ చౌరస్తా, సంగారెడ్డి దాబాలు, బార్లలో విచ్చలవిడిగా తాగుడు
- సమయపాలన లేకుండా అర్ధరాత్రి వేళల్లో క్యాంపస్‌లోకి రాకపోకలు
- ఏకంగా హాస్టల్ గదుల్లోకే మద్యం సీసాలు..
- తెల్లవార్లూ తాగుతున్న విద్యార్థులు
- అకృత్యాలు భరించలేకే రోడ్డెక్కిన తోటి విద్యార్థులు
- హాస్టళ్లలో కనిపించని వార్డెన్ల వివరాలు
- కనీసం అందుబాటులో లేని హెల్ప్‌లైన్ నంబర్లు
- కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే గాడినపడనున్న ప్రతిష్ఠ






### మత్తు తలకెక్కి దాడులు

మద్యం మత్తు తలకెక్కడంతో తాము ఏం చేస్తున్నామో కూడా తెలియని స్థితిలో కొందరు సీనియర్లు తోటి విద్యార్థులపై, జూనియర్లపై దాడులకు తెగబడుతున్నారు. ర్యాగింగ్ పేరుతో గదుల్లోకి పిలిపించి చితకబాదడం, బలవంతపు పనులు చేయించడం పరిపాటిగా మారింది. ఇటీవల ఈఈఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రుత్విక్‌పై ప్రాణాంతక దాడి జరిగి గొంతు నులిమినంత పని చేయడం కూడా ఈ విచ్చలవిడి సంస్కృతికి పరాకాష్ట అని తెలుస్తోంది. మద్యం మత్తులో జరుగుతున్న ఈ ఆగడాలను భరించలేకే విద్యార్థుల సహనం కట్టలు తెంచుకుని, జాతీయ రహదారిపైకి వచ్చి రాస్తారోకో చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### రాత్రిళ్లు బార్లు, దాబాల్లో తాగుడు..

విద్యార్థులు రాత్రి వేళల్లో క్యాంపస్ దాటి జోగిపేట పట్టణం, ఎంఎన్‌ఆర్ చౌరస్తా, సంగారెడ్డి వరకు వెళ్లి స్థానిక బార్లు, దాబాలలో విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నట్లు తోటి విద్యార్థులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. బయట తాగడమే కాకుండా, ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛగా మద్యం సీసాలను కళాశాల కాంపౌండ్ లోపలికి, హాస్టల్ గదుల్లోకి తెచ్చి తెల్లవార్లూ తాగుడు విందులు చేసుకుంటున్నారు. క్యాంపస్ ప్రధాన ద్వారం వద్ద సరైన పర్యవేక్షణ, రాత్రి వేళల్లో గదుల తనిఖీలు లేకపోవడంతో హాస్టల్ గదులు కాస్తా మద్యం అడ్డాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అటకెక్కిన మానిటరింగ్ వ్యవస్థ

హాస్టళ్లలో ఏదైనా అనుకోని సంఘటన, దాడి లేదా ర్యాగింగ్ జరిగితే వెంటనే ఫిర్యాదు చేసేందుకు ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. నిబంధనల ప్రకారం ప్రతి హాస్టల్ బ్లాక్ ప్రవేశ ద్వారం వద్ద ఇన్ ఛార్జ్ వార్డెన్ల పేర్లు, అత్యవసర ఫోన్ నంబర్లు, యాంటీ ర్యాగింగ్ కమిటీ వివరాలు రాసిన బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలి. కానీ సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో కనీస సమాచార బోర్డులు కానీ, హెల్ప్‌లైన్ నంబర్లు కానీ ఎక్కడా కనిపించడం లేదు. అత్యవసర సమయంలో ఫోన్ చేసి సమాచారం ఇద్దామన్నా ఎవరిని సంప్రదించాలో తెలియక విద్యార్థులు నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వస్తోంది.

### కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే మనుగడ

ఇప్పటికైనా కళాశాల ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ పాలకమండలి మేల్కొని కఠినమైన మానిటరింగ్ నిబంధనలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిర్దిష్ట సమయం దాటితే క్యాంపస్ గేట్లు దాటి ఎవరినీ బయటకు వెళ్లనివ్వకుండా కట్టుదిట్టమైన ఆంక్షలు విధించాలి. రాత్రి వేళల్లో సెక్యూరిటీ గార్డులతో హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. మద్యం, మత్తు పదార్థాలతో పట్టుబడితే ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. వార్డెన్లు రాత్రి వేళల్లో హాస్టళ్లలోనే బస చేసేలా చర్యలు తీసుకుని, కఠిన నిర్ణయాలు అమలు పరిస్తే తప్ప సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ పూర్వ వైభవం తిరిగి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.





# అసైన్డ్ భూమికి నోటీసుల షాక్ !




## ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్‌కు, భూ పట్టాదారుకు షోకాజ్

## 'సిరి' కథనానికి స్పందన

- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశం
- పట్టా రద్దు.. భూమి స్వాధీనంపై వివరణ కోరిన అధికారులు

పటాన్‌చెరు (రామచంద్రపురం), సెప్టెంబర్ 30 (సిరి న్యూస్): అసైన్డ్ భూమిలో రెడీమిక్స్ ప్లాంట్ నిర్వహణపై 'సిరి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. పాటి గ్రామంలోని సర్వే నంబర్ 269లో అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇచ్చిన వ్యవహారంపై విచారణ చేపట్టి, భూ పట్టాదారు, ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, సమాధానం ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. పాటి గ్రామంలోని సర్వే నంబర్ 269లో ఉన్న 0.38 గుంటల ప్రభుత్వ అసైన్డ్ భూమిని దర్గా గోపాలకృష్ణకు సాగు కోసం కేటాయించగా.. అందులో వ్యవసాయం చేయకుండా ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్ నిర్వహిస్తున్నారని స్థానికుడు వెంకట్ రమణ రెడ్డి కూడా గతంలో పటాన్‌చెరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


www.siridaily.com | సిరి | 3

ఆర్ఎంసీ బరితెగింపు

అసైన్డ్ భూమినీ వదల్లే!





### 15 రోజుల్లో వివరణ...

'సిరి' కథనాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు పరిశీలన చేపట్టగా, సదరు అసైన్డ్ భూమిని ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్ యాజమాన్యానికి లీజుకు ఇచ్చినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై భూ పట్టాదారు, ప్లాంట్ యాజమాన్యానికి తహసీల్దార్ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

### పట్టా రద్దు.. భూమి స్వాధీనంపై వివరణ..

అసైన్డ్ భూముల బదిలీ నిషేధ చట్టం-1977 నిబంధనలకు విరుద్ధంగా భూమిని లీజుకు ఇచ్చినందుకు ఫారమ్-1 నోటీసు ద్వారా దర్గా గోపాలకృష్ణను వివరణ కోరారు. భూమి పట్టాను ఎందుకు రద్దు చేయకూడదో, సదరు భూమిని ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో ఆధారాలతో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

### ప్లాంట్ యాజమాన్యానికీ నోటీసు

అదేవిధంగా ఫారమ్-2 నోటీసు ద్వారా ఎస్ఎస్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్ యాజమాన్ని వివరణ కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న భూమిని ఎందుకు ఖాళీ చేయించకూడదో, అక్కడి నిర్మాణాలను ఎందుకు జప్తు చేయకూడదో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా తమ వద్ద ఉన్న ఆధారాలతో రాతపూర్వక వివరణ సమర్పించాలని తహసీల్దార్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా తగిన సమాధానం అందకపోతే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.


సిరి

ఆర్ఎంసీ బరితెగింపు

అసైన్డ్ భూమినీ వదల్లే!






# ఆ ఎస్సై తీరే వేరు!

## కాంట్రవర్సీకి కేరాఫ్ జహీరాబాద్ ఎస్సై లవ్ కుమార్

- రాత్రంతా విచారణ.. మరుసటి రోజూ రావాలనడంతో తీవ్ర భయాందోళన
- ఇంట్లో ఉరివేసుకుని 30 ఏళ్ల యువకుడు ఆత్మహత్య
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం
- పోలీసుల వేధింపులే ప్రాణం తీశాయంటూ బాధితుల ఆందోళన
- ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి ఠాణా ఎదుట ధర్నా
- శేఖర్ బలవన్మరణంపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్
- గతంలోనూ భూవివాదంలో యాదయ్య అనుమానాస్పద మృతి
- అచ్చంపేటలో ఏసీబీ ట్రాప్, సస్పెన్షన్.. అయినా మారని తీరు
- లవ్ కుమార్‌ను విధుల నుంచి తప్పించాలని నిరసనలు

## దొంగతనం కేసులో విచారణ పేరిట శేఖర్‌ను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు

**సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ లవ్ కుమార్ వ్యవహారశైలి, విధి నిర్వహణ తీరుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, సాధారణ అనుమానితుల పట్ల కనీస సంయమనం లేకుండా దురుసుగా వ్యవహరిస్తున్నారని, విచారణ పేరుతో తీవ్రస్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ పలువురు బాధితులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తించాల్సిన పోలీస్ వ్యవస్థపై సామాన్య ప్రజల్లో భయాందోళనలు రేకెత్తే పరిస్థితి ఏర్పడటం మంచిది కాదని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఠాణా భయపెట్టే కేంద్రంగా మారకూడదని స్థానిక వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.**

(నిఘా విభాగం-సిరిన్యూస్)

### యాదయ్య మృతి కేసులోనూ అనుమానాలు

ఇదే పోలీస్ అధికారి వ్యవహారశైలిపై గతంలోనూ తీవ్ర ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రంజాన్ గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి విషయంలోనూ సివిల్, భూ వివాదాల్లో జోక్యం చేసుకుని స్టేషన్‌కు పిలిపించి వేధించారనే ఆరోపణలు వచ్చాయని, ఆ తర్వాతే అతను ఉరేసుకుని చనిపోయాడని స్థానికంగా ప్రచారం సాగుతోంది.

### రాత్రంతా విచారణ.. మరుసటి రోజూ రావాలనడంతో శేఖర్ బలవన్మరణం

తాజాగా ఓ దొంగతనం కేసు విచారణ నిమిత్తం కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన గూళ్ల శేఖర్ (30) అనే యువకుడిని జహీరాబాద్ పట్టణ పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం, సోమవారం అర్ధరాత్రి వరకు అతడిని స్టేషన్‌లోనే ఉంచి విచారించి అనంతరం ఇంటికి పంపించారు. అయితే మరుసటి రోజు ఉదయమే మళ్లీ పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ సమాచారం అందడంతో శేఖర్ తీవ్ర మానసిక ఆందోళన, భయాందోళనలకు గురయ్యాడు. పోలీసుల విచారణ తీరుకు భయపడి అతడు ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో ఆగ్రహించిన మృతుడి బంధువులు, గ్రామస్తులు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టడంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

### విచారణలో ఎవరి తప్పు ఎంత?

యువకుడిపై ఏదైనా ఫిర్యాదు లేదా కేసు ఉంటే చట్ట ప్రకారం సమగ్ర దర్యాప్తు చేసి కోర్టు ముందు నిలబెట్టే పూర్తి అధికారం పోలీసులకు ఉంటుందని, అయితే విచారణకు హాజరైన కొద్ది గంటల్లోనే ఒక వ్యక్తి ప్రాణాలు తీసుకునే పరిస్థితి ఎందుకు దాపురించిందన్నది తేలాలని ప్రజాసంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. 'కేసు వేరు.. ఒక మనిషి ప్రాణం వేరు' అని, ఎవరి తప్పు ఎంత ఉందన్నది ముందుగానే ఏకపక్ష నిర్ణయానికి రాకుండా అధికారికంగా నిగ్గుతేల్చాల్సి ఉందని వారు అంటున్నారు. శేఖర్‌ను ఏ సమయానికి స్టేషన్‌కు పిలిపించారు? ఎంతసేపు విచారించారు? విచారణలో పాల్గొన్న అధికారులు ఎవరు? కుటుంబ సభ్యులతో జరిపిన సంభాషణలేమిటి? అన్న పూర్తి వివరాలను నిష్పక్షపాత విచారణ ద్వారానే వెలుగులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఏసీబీ ట్రాప్.. సస్పెన్షన్ వేటు..

అంతేకాకుండా సదరు అధికారి గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట ప్రాంతంలో పనిచేసిన కాలంలో ఏసీబీ ట్రాప్, సస్పెన్షన్ వంటి చర్యలను ఎదుర్కొన్నారని చెబుతున్నారు. చిన్న విషయాలకే బలగాలతో వ్యాపార సంస్థలు, హోటళ్లపై ఆకస్మిక సోదాల పేరిట భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం చెబుతున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ నినాదానికి ఇది పూర్తి విరుద్ధమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### సీసీటీవీ దృశ్యాలు, కాల్ డేటాతోనే వాస్తవాల నిరూపణ..

ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో విచారణకు హాజరైన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం అత్యంత సున్నితమైన అంశం కావడంతో, కేవలం మాటలకే పరిమితం కాకుండా చట్టబద్ధమైన సాంకేతిక ఆధారాల ఆధారంగా లోతైన దర్యాప్తు జరగాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్‌లోని సీసీ కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ ఎలా సాగిందో రికార్డు చేయాలి. దాంతో పాటు స్టేషన్ జనరల్ డైరీ ఎంట్రీలు, విచారణకు పిలిపించే ముందు అధికారిక నోటీసులు జారీ చేశారా లేదా అన్నది తనిఖీ చేయాలి. బాధితుడికి, కుటుంబ సభ్యులకు వచ్చిన ఫోన్ కాల్స్, కాల్ డేటా రికార్డులను విశ్లేషించడంతో పాటు, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల పూర్తి కారణాలను బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### విధులనుంచి తప్పించాలని డిమాండ్..

ఎస్సైని సస్పెండ్ చేయాలని బాధిత కుటుంబాలు, ప్రజాప్రతినిధులు గట్టిగా పట్టుబడుతున్నప్పటికీ, ఇప్పటివరకు అలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారిక సమాచారం లభించలేదు. సదరు అధికారి విధుల్లో కొనసాగితే సాక్ష్యాధారాలు తారుమారయ్యే అవకాశం ఉందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. అందువల్ల ముందుగా ఆయనను జహీరాబాద్ పట్టణ స్టేషన్ బాధ్యతల నుంచి తప్పించి, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరుతున్నారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో డీజీపీ, సంగారెడ్డి ఎస్పీతో పాటు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు స్థానికులు స్పష్టం చేశారు.



# హోటల్ భోజనం.. ఆరోగ్యానికి భారం !

## బయట మెరిసే హోటళ్లు.. లోపల అపరిశుభ్రత

- నిల్వ ఆహారం, పాడైన ముడిసరుకులతో వంటలు
- ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో వెలుగులోకి వస్తున్న విస్తుపోయే నిజాలు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (సిరి న్యూస్): హైదరాబాద్.. ఐటీ కంపెనీలు, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేవారితో నిత్యం కిటకిటలాడే మహానగరం. నగర జీవనంలో హోటళ్లు, రెస్టారెంట్లు కీలక భాగంగా మారిపోయాయి. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు చాలామంది బయట ఆహారంపైనే ఆధారపడుతున్నారు. వీకెండ్లలో కుటుంబాలతో, స్నేహితులతో రెస్టారెంట్లకు వెళ్లడం కూడా సాధారణమైంది. అయితే బయట నుంచి చూస్తే మెరిసిపోయే కొన్ని హోటళ్ల వంటగదుల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోందన్న విషయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు బయటపెడుతున్నాయి. కస్టమర్ల నుంచి భారీగా బిల్లులు వసూలు చేస్తున్నా.. ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, వంటగది పరిశుభ్రత విషయంలో కొన్ని సంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

### ప్లేట్‌లోకి వచ్చేది ఏమిటి?

వినియోగదారుడి ముందుకు అందంగా అలంకరించి వచ్చే ఆహారం వెనుక ఏం జరుగుతుందనేది చాలామందికి తెలియదు. ముడిసరుకులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎంతకాలం నిల్వ ఉంచుతున్నారు? ఫ్రిజ్‌లో ఏ విధంగా భద్రపరుస్తున్నారు? వండిన ఆహారాన్ని ఎంతసేపటికి వినియోగిస్తున్నారు? వంటి విషయాలపై కస్టమర్‌కు సాధారణంగా సమాచారం ఉండదు. ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో మాత్రం కొన్ని చోట్ల నాణ్యత కోల్పోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన డ్రైఫ్రూట్స్, పాడైన పదార్థాలు, నాణ్యత లేని మాంసం వంటి వాటిని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇలాంటి ముడిసరుకులతో తయారయ్యే ఆహారం వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉంటుంది.

### కిచెన్‌లో పరిశుభ్రత ఎక్కడ?

హోటల్ ఎంత పెద్దదైనా.. ఆహార భద్రతకు అసలు పరీక్ష కిచెన్‌లోనే. అక్కడ పరిశుభ్రత లేకపోతే ఖరీదైన ఇంటీరియర్, బ్రాండెడ్ మెనూ, ఆకర్షణీయమైన సర్వీస్ అన్నీ వృథానే. తనిఖీల సందర్భంగా కొన్ని వంటగదుల్లో బొద్దింకలు, ఈగలు, ఎలుకల సంచారం, వాటి మలమూత్రాలు కనిపించినట్లు అధికారులు గుర్తించారు. మురికిగా ఉన్న వంట ప్రదేశాలు, తుప్పుపట్టిన సింక్‌లు, సరిగా శుభ్రం చేయని పరికరాలు కూడా బయటపడినట్లు తెలిపారు. వంటగదిలోనే పొగతాగడం, పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వంటి ఉల్లంఘనలు కూడా కొన్ని చోట్ల గుర్తించినట్లు పేర్కొన్నారు.

### పచ్చి మాంసం.. వండిన ఆహారం ఒకేచోట!

ఆహార భద్రతలో ముడి పదార్థాలు, వండిన ఆహారాన్ని వేర్వేరుగా నిల్వ చేయడం అత్యంత కీలకం. అయితే కొన్ని తనిఖీల్లో వండని మాంసం, ఇప్పటికే వండిన ఆహారాన్ని సరైన వేర్పాటు లేకుండా ఫ్రిజ్‌లలో నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇలా చేయడం వల్ల ముడి పదార్థాల నుంచి సూక్ష్మజీవులు వండిన ఆహారానికి చేరే ప్రమాదం ఉంటుంది. దీనినే ఆహార భద్రతలో 'క్రాస్ కంటామినేషన్'గా పరిగణిస్తారు. ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయకపోవడం, పాత ఆహారాన్ని మళ్లీ వేడి చేసి అందించడం వంటి పద్ధతులు కూడా ఆరోగ్యపరంగా సమస్యలకు దారితీయవచ్చు.

### పేరు పెద్దది.. నాణ్యత మాటేమిటి?

మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ వంటి ప్రాంతాల్లో రెస్టారెంట్లకు భారీ డిమాండ్ ఉంది. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు పెద్ద సంఖ్యలో హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆహార వ్యాపారం కూడా భారీగా విస్తరించింది. అయితే వ్యాపారం పెరుగుతున్న కొద్దీ ఆహార నాణ్యతపై కూడా అదే స్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. బ్రాండ్ పేరు, ఖరీదైన ఇంటీరియర్, సోషల్ మీడియా ప్రచారం ఉన్నంత మాత్రాన ఆహారం సురక్షితమని భావించడం సరికాదని ఫుడ్ సేఫ్టీ నిపుణులు సూచిస్తున్నారు.

### ఆరోగ్యంపై ప్రభావం ఎలా?

కలుషితమైన లేదా సరిగా నిల్వ చేయని ఆహారం తినడం వల్ల ఆహార సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం వంటి సమస్యలు తాత్కాలికంగా కనిపించవచ్చు. కొన్ని సందర్భాల్లో కలుషిత ఆహారం కారణంగా తీవ్రమైన ఇన్ఫెక్షన్లు కూడా సంభవించవచ్చు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలున్న వ్యక్తుల్లో సమస్యలు తీవ్రంగా మారే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి అనారోగ్యానికి హోటల్ ఆహారమే కారణమని చెప్పలేమని, నిర్ధారణకు వైద్య పరీక్షలు అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

### అధికారుల నిఘా మరింత పెరగాలి

హైదరాబాద్‌లో హోటళ్లు, రెస్టారెంట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలను నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆకస్మిక తనిఖీలతో పాటు నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, లైసెన్సింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, మళ్లీ అదే తప్పులు జరగకుండా ఫాలోఅప్ తనిఖీలు చేపట్టడం కీలకం. కేవలం తనిఖీలు నిర్వహించి నోటీసులు ఇవ్వడంతో కాకుండా, ఉల్లంఘనలు సరిచేశారా లేదా అన్నదానిపై కూడా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

### కస్టమర్లూ.. మీరూ జాగ్రత్త!

హోటల్‌కు వెళ్లినప్పుడు రుచితో పాటు పరిశుభ్రతను కూడా గమనించడం అవసరం. ఆహారం వాసన, రంగు లేదా రుచి అనుమానాస్పదంగా అనిపిస్తే తినకుండా ఉండటం మంచిది. రెస్టారెంట్ పరిసరాలు, టేబుళ్ల పరిశుభ్రత, ఆహారం అందించే విధానం వంటి అంశాలను కూడా గమనించవచ్చు. ఆహారం నాణ్యతపై అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం ద్వారా ఇతర వినియోగదారులను కూడా అప్రమత్తం చేయవచ్చు.

**హోటల్ అంటే కేవలం రుచికరమైన భోజనం అందించే ప్రదేశం కాదు.. సురక్షితమైన ఆహారం అందించే బాధ్యత కలిగిన వ్యవస్థ. కస్టమర్ చెల్లించే డబ్బుకు తగిన నాణ్యతతో పాటు అతని ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత కూడా హోటల్ యాజమాన్యానిదే. నగరంలో హోటళ్ల వ్యాపారం ఎంత వేగంగా విస్తరిస్తుందో.. అదే స్థాయిలో ఆహార భద్రత ప్రమాణాలు కూడా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.**